


జనం మెచ్చేలా సంక్షేమం

- ఒక ఏడాది.. రెండు ప్రభుత్వాలు
- అధికారంలోకి చంద్రబాబు
- వైఎస్ జగన్‌కు బిగ్ షాక్
- వారం రోజుల్లో ముగియనున్న 2024





2024... ఈ ఏడాది ఇటు ప్రజలకు.. అటు రాజకీయ నాయకులకు చాలా ప్రత్యేకం. మరీ ముఖ్యంగా తెలుగుదేశం, వైసీపీలకు తీర్పు ప్రకటించిన ఏడాది. ఆ రెండు పార్టీలకు చేదు, తీపి అనుభవాలు పంచిన వెరీ స్పెషల్ ఇయర్ వారం రోజుల్లో కాలగర్భంలో కలిసిపోనుంది. 2024 సంవత్సరం రెండు ప్రభుత్వాలను చూసింది. మొదటి ఆరు నెలలు జగన్ హయాంలోని వైసీపీ పాలన సాగింది. ఆ తర్వాత చంద్రబాబు హయాంలోని ఎన్డీయే కూటమి పాలన వచ్చి కొనసాగుతోంది. ఈ ఏడాది కూటమి నేతలకు కలసి వస్తే.. వైసీపీ అధినేత జగన్ మాత్రం ముఖ్యమంత్రి పదవిని కోల్పోయారు. మొత్తం మీద మొదటి ఆరు నెలలు.. తర్వాతి ఆరు నెలల సంక్షేమ పాలనపై ఆంధ్రజ్యోతి 2024 రౌండప్ కథనం.

6లో



కర్నూలు నగరం జగన్నాథగట్టులో నిర్మించిన ఏపీ టిడ్కో ఇళ్లు

- ఉమ్మడి జిల్లాలో 23,645 ఇళ్లు పూర్తి
- గత టీడీపీ ప్రభుత్వంలోనే గృహ ప్రవేశాలకు సన్నాహాలు
- వైసీపీ హయాంలో నిర్లక్ష్యం
- ముళ్ల కంపలు పెరిగి శిథిలావస్థకు చేరుతున్న నిర్మాణాలు
- మళ్లీ చంద్రబాబు ప్రభుత్వం రాకతో లబ్ధిదారుల్లో ఆశలు
- కూటమి ప్రభుత్వం ఏర్పడి ఆరు నెలలైనా పంపిణీకి నోచుకోని వైనం

టిడ్కో ఇళ్లు ఎప్పుడిస్తారు..?

పట్టణ పేదలకు సొంతింటి కల నిజం చేయాలని గత టీడీపీ ప్రభుత్వం ఏపీ టిడ్కో ఇళ్ల నిర్మాణాలకు శ్రీకారం చుట్టింది. ఉమ్మడి కర్నూలు జిల్లాలో 52,318 ఇళ్లు మంజూరు చేసింది. దాదాపుగా 23,645 టిడ్కో ఇళ్ల నిర్మాణాలు 90 శాతానికి పైగా పూర్తయ్యాయి. 2019 మేలో జగన్ సారథ్యంలో వైసీపీ ప్రభుత్వం ఏర్పడ్డాక టిడ్కో ఇళ్ల వ్యవహారం వెనక్కిపోయింది. రూ. వందల కోట్లు ఖర్చు చేసి నిర్మించిన ఇళ్లు నిరుపయోగంగా మారాయి. ముళ్లకంప పెరిగింది. ఇనుప కడ్డీలు తుప్పు పట్టాయి. ఇళ్లలో దొంగలు పడి విద్యుత్ వైర్లు దోచుకెళ్లారు. మళ్లీ టీడీపీ కూటమి ప్రభుత్వం రావడంతో లబ్ధిదారుల్లో ఆశలు చిగురించాయి. ఈ ప్రభుత్వం వచ్చి ఆరు నెలలైనా పట్టించుకోకపోవడంతో .. టిడ్కో ఇళ్లు ఎప్పుడిస్తారని లబ్ధిదారులు ప్రశ్నిస్తున్నారు. గతంలో ఇళ్లలో చేరిన పేదలు తాగునీరు, రోడ్లు, రవాణా.. వంటి సౌకర్యాలు లేక అవస్థలు పడుతున్నారు. కొందరు ఖాళీ చేసి వెళ్లిపోయారు. ఏపీ టిడ్కో ఇళ్ల దుస్థితిపై ఆంధ్రజ్యోతి క్షేత్రస్థాయి పరిశీలన కథనం.

కర్నూలు, డిసెంబరు 24 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి కర్నూలు జిల్లాలో కర్నూలు, నంద్యాల, ఆదోని, ఎమ్మిగనూరు, డోన్, ఆళ్లగడ్డ, ఆత్మకూరు పట్టణాల్లో పేదలకు నీడ కల్పించాలనే సంకల్పంతో గత టీడీపీ ప్రభుత్వం ప్రధానమంత్రి ఆవాస్ యోజన-ఎన్టీఆర్ ఇళ్ల పథకం కింద నాలుగు విడతల్లో 52,318 ఏపీ టిడ్కో ఇళ్లు మంజూరు చేసింది. దీనికి రూ.3,130 కోట్లు కేటాయించింది. ఇటుకలు, పిల్లర్లు లేకుండా షేర్‌వాల్ టెక్నాలజీతో జీ+3 అపార్ట్‌మెంట్స్ నిర్మాణాలు చేపట్టారు. ఆంధ్రప్రదేశ్ టౌన్ ఇన్ఫ్రాస్ట్రక్చర్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ (ఏపీ టిడ్కో) ఇంజనీర్ల పర్యవేక్షణలో.. మహారాష్ట్రకు చెందిన షాపూర్జీ, పల్లన్‌జీ సంస్థకు ఈ ఇళ్ల నిర్మాణాలు పనులు మొదలు పెట్టారు. 31,280 ఇళ్లకు అగ్రిమెంట్ చేసుకోగా.. క్షేత్రస్థాయిలో 30,672 ఇళ్ల నిర్మాణాల పనులు మొదలయ్యాయి. 2019 జనవరి నాటికే 23,645 ఇళ్లు పూర్తి చేశారు. లబ్ధిదారులను కూడా ఎంపిక చేశారు. ప్రభుత్వం నిర్దేశించిన లబ్ధిదారుల వాటా నగదు కూడా నాలుగు విడతల్లో చెల్లించారు. నిబంధనలు ప్రకారం మెజార్టీ ఇళ్ల నిర్మాణం పూర్తి చేయడంతో గృహ ప్రవేశాలకు సన్నాహాలు చేశారు. అయితే.. తాగునీరు, రోడ్లు, విద్యుత్.. వంటి మౌలిక వసతుల కల్పనతో జాప్యం కావడం, ఇంతలోనే ఎన్నికల నోటిఫికేషన్ రావడంతో గృహ ప్రవేశాలు జరగలేదు.



అసంపూర్తిగా ఓహెచ్ఆర్ ట్యాంక్ నిర్మాణ పనులు

వైసీపీ ఐదేళ్ల నిర్లక్ష్యం.. పేదలకు శాపం

2019 మేలో వైసీపీ ప్రభుత్వం ఏర్పడడంతో ఏపీ టిడ్కో ఇళ్ల పంపిణీ వ్యవహారం ఆగిపోయింది. ఉమ్మడి జిల్లాలో మంజూరైన 52,318 ఇళ్లలో టెండర్లు జరిగి పనులు మొదలు పెట్టని 21,038 ఇళ్లను రద్దు చేశారు. మిలిగిన 31,289 ఇళ్లలో 23,645 ఇళ్లు టీడీపీ ప్రభుత్వ కాలంలో 90 శాతానికి పైగా పూర్తయ్యాయి. కొన్ని ఇళ్లు గృహ ప్రవేశాలకు సిద్ధం చేశారు. 2,500 ఇళ్లకు రివర్స్ టెండరింగ్ పద్ధతిలో టెండర్లు పూర్తి చేసినా పనులు మొదలు పెట్టలేదు. అయితే.. కొన్నాళ్లకు టిడ్కో ఇళ్ల పంపిణీ పేరిట నాటి వైసీపీ ప్రభుత్వం హడావుడి చేసింది. 23,645 ఇళ్లకు గాను 7,007 ఇళ్ల లబ్ధిదారులకు తాళాలు అప్పగించారు. కనీస సౌకర్యాలు లేకపోవడంతో నేటికి 150-200 ఇళ్లలో కూడా లబ్ధిదారులు నివసించడం లేదు. నందికొట్కూరు, ఆత్మకూరు పట్టణాల్లో ఫేజ్-4లో మంజూరు చేసిన 3,800 టిడ్కో ఇళ్లు వైసీపీ హయాంలో రద్దు చేశారు. రూ.వేల కోట్లు ఖర్చు చేసిన ఆధునాతన సాంకేతిక పరిజ్ఞానంతో నిర్మించిన ఇళ్లు నిరుపయోగంగా మారాయి. శిథిలావస్థకు చేరుకుంటున్నాయి. కర్నూలు నగరంలో టిడ్కో ఇళ్లలో దొంగలు పడి పలు అపార్ట్‌మెంట్లలో విద్యుత్ వైరు దోచుకెళ్లారు. ఆ ఇళ్లలో నేటికి విద్యుత్ వైరింగ్ చేయలేదు.

మిగతా 6లో..


కర్నూలులో టిడ్కో ఇళ్ల దుస్థితి



శాంతియుత జీవనం

దయామయుని మార్గం...

నేడు 'క్రిస్మస్'



కర్నూలు నగరంలోని కోల్స్ చర్చి



కర్నూలు కల్చరల్, డిసెంబరు 24 (ఆంధ్రజ్యోతి): సమస్త మానవ జాతి సుఖ శాంతులతో జీవించాలని ఉద్బోధించిన మహా నీయుడు యేసుక్రీస్తు. ప్రేమతత్వంతో, కరుణాగుణంతో, దయార్ద్రభావనలతో పొరుగువాడి పట్ల ఆప్యాయత కలిగి ఉండాలని ప్రబోధించి, మానవజాతి పాప పరిహారం కోసం తాను శిలువ మోసిన చారిత్రక పురుషుడు క్రీస్తు. ఆ మహనీయుని పుట్టినరోజు వేడుక 'క్రిస్మస్' పండుగను బుధవారం ఉమ్మడి జిల్లాలోని క్రైస్తవులు ఘనంగా నిర్వహించుకోనున్నారు. ఈ సందర్భంగా ప్రత్యేక క్రిస్మస్ ప్రార్థనలకు అన్ని క్రైస్తవ మందిరాలు ముస్తాబయ్యాయి. రంగు రంగుల విద్యుద్దీపాలతో చర్చిలను ఆకర్షణీయంగా తీర్చి దిద్దారు. చర్చిలపై నక్షత్రాలను ఎగురవేశారు. కొన్ని చర్చిలలో క్రీస్తు జననానికి సంకేతంగా ఆయన పుట్టిన పశువుల పాక నమూనాలు అందంగా అలంకరించారు.



బిషప్ చర్చిలో అర్ధరాత్రి 12 గంటల సమయంలో క్రిస్మస్ వేడుకలు



క్రిస్మస్ శుభాకాంక్షలు తెలిపిన కలెక్టర్

కర్నూలు కలెక్టరేట్, డిసెంబరు 24 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో ఉన్న క్రైస్తవులకు కలెక్టర్ పి.రంజిత్ బాషా మంగళవారం ఓ ప్రకటనలో క్రిస్మస్ శుభాకాంక్షలు తెలిపారు. యేసుక్రీస్తు ప్రపంచ సర్వమత శాంతి స్థాపన కోసం పుట్టిన మహనీయుడు, గొప్ప శాంతిదూత అన్నారు. క్రిస్మస్ పండుగ శుభ సందర్భంగా అందరికీ శాంతి, సౌభాగ్యాలు చేకూరాలని ఆయన ఆకాంక్షించారు. క్రిస్మస్ వేడుకలు ప్రతి ఒక్కరి జీవితంలో సంతోషాన్ని నింపాలని, ఇంటింటా ఆనంద కాంతులు వెల్లివిరియాలని ఆకాంక్షించారు. శత్రువులను మిత్రులుగా మార్చి వారు శాంతి మార్గంలో పయనించేలా యేసుక్రీస్తు ప్రేమ మార్గాన్ని చూపారన్నారు. ఆయన మార్గం అందరికీ ఆదర్శనీయమని, శాంతిమార్గంలో ప్రతి ఒక్కరూ పయనించాలని పిలుపునిచ్చారు.

అభివృద్ధి లక్ష్యాలను సాధించండి

కలెక్టర్ పి.రంజిత్ బాషా

కర్నూలు కలెక్టరేట్, డిసెంబరు 24 (ఆంధ్రజ్యోతి): ఎంపిక చేసిన మండలాల్లో నిర్దేశించిన అభివృద్ధి లక్ష్యాలను త్వరితగతిన సాధించాలని కలెక్టర్ పి.రంజిత్ బాషా అధికారులను ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాల్లో జిల్లాలో యాస్పిరేషనల్ బ్లాక్‌లో అభివృద్ధి లక్ష్యాల పురోగతిపై కలెక్టర్ సంబంధిత అధికారులతో సమీక్ష నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ దేశంలో యాస్పిరేషనల్ బ్లాక్స్ కింద 471 బ్లాక్స్‌ను ఎంపిక చేసిందని, అందులో జిల్లాలో మద్దికెర, హొళగుంద, చిప్పగిరి మండలాలు ఎంపికయ్యాయన్నారు. ఐసీడీఎస్‌కు సంబంధించి గర్భిణులకు పోషకాహారం అందించడంలో సప్లిమెంటరీ న్యూట్రిషన్‌లో 95 శాతం మాత్రమే పురోగతి సాధించామన్నారు. వచ్చే సమావేశంలో వందశాతం పురోగతి సాధించాలని పీడీని ఆదేశించారు. ఈ సమావేశంలో జడ్పీ సీఈవో నాసరరెడ్డి, ఇన్‌చార్జి సీపీవో భారతి, ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్ఈ నాగేశ్వరరావు, హౌసింగ్ పీడీ చిరంజీవి, ఐసీడీఎస్ పీడీ నిర్మల, డీఎంహెచ్‌వో భాస్కర్ రాజు, డీపీవో భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

బీసీ వసతి గృహాలకు రూ.6.74 కోట్లు విడుదల

కర్నూలు ఎడ్యుకేషన్, డిసెంబరు 24(ఆంధ్రజ్యోతి): జిల్లాలోని బీసీ వసతి గృహాలకు డైట్, కాస్మోటిక్ చార్జీలకుగాను రూ.6.74 కోట్లు బడ్జెట్‌ను విడుదల చేసినట్లు జిల్లా బీసీ సంక్షేమ సాధికారత అధికారి వెంకటలక్ష్మి తెలిపారు. జిల్లాలోని 28 ప్రీ మెట్రిక్ హాస్టళ్లకు 3వ క్వార్టర్ డైట్ చార్జీలకు గాను రూ.2,54,24,500, కాస్మోటిక్ చార్జీలకు రూ.14,43,900 విడుదల అయ్యాయన్నారు. అలాగే 4వ క్వార్టర్‌కు రూ.2,39,77,700 కాస్మోటిక్ చార్జీల కింద రూ.20,84,600 విడుదలైనట్లు తెలిపారు. 14 పోస్టు మెట్రిక్ హాస్టల్స్ విద్యార్థులకు కాస్మోటిక్ చార్జీలకు రూ.47,24,800, 4వ క్వార్టర్ డైట్ చార్జీలకు రూ.91,10,600, కాస్మోటిక్ చార్జీలకు రూ.6,79,100 విడుదలైనట్లు వివరించారు.

రెవెన్యూ సదస్సులో 244 అర్జీలు

కర్నూలు కలెక్టరేట్, డిసెంబరు 24 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో మంగళవారం 19 గ్రామాల్లోని రెవెన్యూ సదస్సులో 244 అర్జీలు స్వీకరించినట్లు జిల్లా రెవెన్యూ అధికారి వెంకట నారాయణమ్మ తెలిపారు. ఆదోని రెవెన్యూ డివిజన్‌లోని ఎర్రబాడు గ్రామంలో 21, గంగవరంలో 6, కలుగోట్లలో 30, జంపాపురంలో 13, గుర్రాలదొడ్డిలో 11, రచ్చుమర్రిలో 11, బాసరకోడులో 8, సల్కాలకొండలో 5, కోగిలతోటలో 26, కర్నూలు రెవెన్యూ డివిజన్‌లోని పాలకొలనులో 5, చిన్నటేకూరులో 10, మలేపల్లిలో 5, ఆర్.కొంతలపాడులో 31, పత్తికొండ రెవెన్యూ డివిజన్‌లోని లింగనాయుని దొడ్డిలో 4, బసినేపల్లిలో 11, దేగలహాల్‌లో 7, ఆస్పరిలో 11, నెట్రవట్టిలో 19, దేవనకొండలో 10 అర్జీలు వచ్చినట్లు డీఆర్వో తెలిపారు.

రాష్ట్రాన్ని నాశనం చేసిన జగన్

- 2029లో పులివెందులలో జగన్ ఓటమి ఖాయం
- కుడా చైర్మన్ సోమిశెట్టి వెంకటేశ్వర్లు



కర్నూలు అర్బన్, డిసెంబరు 24(ఆంధ్రజ్యోతి): 'ఒక్క చాన్స్ పేరుతో అధికారంలోకి వచ్చి రాష్ట్రాన్ని నాశనం చేశావు.. ఐదేళ్ల అరాచకాలకు ప్రజలు 11 సీట్లకు సరిపెట్టారు. అయినా జగన్‌లో బుద్ధిరాలేదు..' అని కుడా చైర్మన్, టీడీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సోమిశెట్టి వెంకటేశ్వర్లు ఆగ్రహం వ్యక్తం చేశారు. మంగళవారం జిల్లా టీడీపీ కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. చంద్రబాబును 2029లో సింగిల్ డిజిట్లకు పరిమితం చేస్తానన్న జగన్ వ్యాఖ్యలపై సోమిశెట్టి చురుకైన విమర్శలు చేశారు. జగన్‌కు దమ్ముంటే 2029లో పులివెందుల నుంచి గెలవాలని సవాల్ విసిరారు. తన కేడర్ ఎక్కడ దూరమవుతుందోనని ఇలాంటి కామెంట్లు చేస్తూ మేకపోతు గాంభీర్యాన్ని ప్రదర్శిస్తున్నాడని ఆరోపించారు. జగన్‌తో పాటు ఆయన పార్టీ మాటలను నమ్మి ప్రజలు మరోసారి మోసపోయేందుకు సిద్ధంగా లేరన్నారు. వైసీపీ ప్రభుత్వ హయాంలో యువత గంజాయి, మత్తు పదార్థాలకు బానిసయ్యారని అన్నారు. ఇకపై చౌకబారు రాజకీయాలు మానుకోవాలని జగన్‌కు సోమిశెట్టి హితవుపలికారు.

పత్తి కొనుగోళ్లకు సాకులు

రైతుల వద్ద భారీగా పత్తి నిల్వలు

కర్నూలు అగ్రికల్చర్, డిసెంబరు 24 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి కర్నూలు జిల్లా రైతులు సాగు చేసిన పత్తిని కొనుగోలులో సీసీఐ అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు. నిత్యం ఏదో ఒక కారణం చూపుతూ కొనుగోళ్లను వాయిదా వేస్తున్నారు. గత వారం కోడుమూరు మార్కెట్ కమిటీ పరిధిలోని పెంచికలపాడులో యంత్రాలు పనిచేయలేదంటూ పత్తి కొనుగోళ్లను నిలిపివేశారు. అదేవిధంగా సోమవారం ఆదోని కొనుగోలు కేంద్రాల్లో క్రిస్మస్ పండుగను పురస్కరించుకుని పత్తి కొనుగోళ్లను నిలిపివేస్తున్నట్లు అధికారులు తెలిపారు. ఇప్పటి దాకా ఆదోని, ఎమ్మిగనూరు, మంత్రాలయం కోడుమూరు మార్కెట్ కమిటీల పరిధిలో 13,890 మంది రైతులతో కేవలం 3.24 లక్షల పత్తిని సీసీఐ కొనుగోలు చేసినట్లు వారికి రూ.237.22 కోట్లు చెల్లించినట్లు మార్కెటింగ్ శాఖ ఏడీఎం నారాయణమూర్తి తెలిపారు. అయితే మొత్తం ఉమ్మడి జిల్లాలో సాగైన పత్తి పంట వివరాలను పరిశీలిస్తే దాదాపు 2లక్షల హెక్టార్లలో పత్తి పంటను రైతులు సాగు చేశారు. గతంలో ఎన్నడూ లేని విధంగా పత్తి దిగుబడి భారీగా పెరిగింది. ఎకరాకు 8 నుంచి 10 క్వింటాళ్ల దాకా చేతికందింది. ఈ పత్తిని కొనుగోలు చేసేందుకు ఎప్పటి నుంచో సీసీఐ అధికారులు ప్రకటనలు జారీ చేస్తూనే ఉన్నారు. రైతుల ఆగ్రహావేశాలను గుర్తించి అధికారులు ఈ నెల మొదటి వారం నుంచి పత్తి కొనుగోళ్లను వేగవంతం చేశారు. వాస్తవంగా రూ.48 లక్షల క్వింటాళ్ల పత్తి దిగుబడి రైతుల చేతికి అందితే ఇప్పటి దాకా కేవలం రూ.3.26 లక్షల క్వింటాళ్లను మాత్రమే సీసీఐ కొనుగోలు చేసింది. బహిరంగ మార్కెట్‌లోనే ఇప్పటి దాకా రూ.30లక్షల క్వింటాళ్ల పత్తిని దళారులు, వ్యాపారులే రైతుల నుంచి క్వింటాకు రూ.6వేల నుంచి రూ.6,500 చెల్లించి కొనుగోలు చేశారు. గోరుచుట్టుపై రోకటి పోటులా వానలు, ముసురు, చల్లని గాలులతో తేమ శాతం ఏ మాత్రం తగ్గకపోవడంతో గిట్టుబాటు ధర అందే అవకాశం లేదని, చాలా మంది రైతులు ఇంకా ఇళ్లలోనే పత్తిని నిల్వ చేసుకున్నారు. సీసీఐ అధికారులు పత్తి కొనుగోలును వేగవంతం చేయాలని రైతులు, రైతు సంఘాల నాయకులు డిమాండ్ చేస్తున్నారు.



రూ.237 కోట్లతో పత్తి కొనుగోళ్లు

- ఏడీఎం నారాయణమూర్తి

కర్నూలు అగ్రికల్చర్, డిసెంబరు 24 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి కర్నూలు జిల్లాలో సీసీఐ ద్వారా ఇప్పటి దాకా రూ.237.22 కోట్లుతో 3.24 లక్షల క్వింటాళ్ల పత్తిని కొనుగోలు చేశామని, త్వరలో రైతులకు వారి బ్యాంకు ఖాతాలకు సీసీఐ ద్వారా అందజేసేందుకు చర్యలు చేపట్టినట్లు ఏడీఎం నారాయణమూర్తి తెలిపారు. ఇప్పటి దాకా 13,690 మంది రైతులు సీసీఐకి పత్తిని అమ్మి మద్దతు ధర పొందారన్నారు. ఆదోని సీసీఐ కేంద్రంలో 6,225 మంది 1,47,644 క్వింటాళ్ల పత్తిని విక్రయించారని, వారికి రూ.109 కోట్లు చెల్లించామని ఏడీఎం తెలిపారు. మంగళవారం విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ ఎమ్మిగనూరు మార్కెట్ కమిటీ పరిధిలో 14250 క్వింటాళ్ల పత్తిని 3,797 మంది రైతులతో మద్దతు ధరకు సీసీఐ అధికారులు కొనుగోలు చేశారని, వారికి రూ.52.99 కోట్లు చెల్లించామని అన్నారు. అదేవిధంగా కోడుమూరు పరిధిలో 2,025 మంది రైతుల నుంచి 60,651 క్వింటాళ్ల పత్తిని కొనుగోలు చేసి వారికి రూ.60 కోట్లు చెల్లించామన్నారు. అదే విధంగా మంత్రాలయంలో 1,547 మంది రైతుల నుంచి 41,515 క్వింటాళ్ల పత్తిని కొనుగోలు చేశామని, వారికి రూ.30.69 కోట్లు చెల్లించామన్నారు. నాలుగు మార్కెట్ కమిటీల పరిధిలో మొత్తం 13,690 రైతుల నుంచి కొనుగోలు చేశామన్నారు.

ఈతకు వెళ్లి ఇంజనీరింగ్ విద్యార్థి మృతి 7 | విద్యార్థినిపై లెక్చరర్ లైంగిక వేధింపులు 7 | 28న స్థాయి సంఘాల సమావేశాలు 7

జనం మెచ్చేలా సంక్షేమం

- అవ్వా తాతలకు రెట్టింపు భరోసా ఇచ్చిన టీడీపీ కూటమి
- వృద్ధులకు రూ.4 వేలు.. దివ్యాంగులకు రూ.6 వేల పింఛన్
- పేదల ఆకలి తీరుస్తున్న 'అన్న క్యాంటిన్లు'
- పేద మహిళలకు దీపం-2 కింద ఉచిత గ్యాస్ సిలిండర్లు
- ఆరు నెలల్లో జనం మెచ్చేలా సంక్షేమం
- ఒక్కొక్కటిగా 'సూపర్ సిక్స్' పథకాల అమలు









2024.. మరో వారం రోజుల్లో కాలగర్భంలో కలసిపోనుంది. 2025 నూతన సంవత్సరంలో అడుగు పెట్టేందుకు యావత్ ప్రపంచం సిద్ధమవుతోంది. ఈ ఏడాది ఆరంభం ఎన్నికల హడావుడితో మొదలైంది. ప్రజలను ఆకట్టుకోవడానికి రాజకీయ పార్టీలు తోచిన హామీలు గుమ్మరించాయి. ఆ క్రమంలోనే ప్రతిపక్షంలో ఉన్న టీడీపీ కూటమి పార్టీలు సంక్షేమం.. అభివృద్ధి రెండు కళ్లు..! అంటూ సూపర్ సిక్స్ వరాలు ప్రకటిస్తే.. ఇవి అమలు అసాధ్యం..! అంటూ అధికార పక్షం వైసీపీ తేల్చేసింది. ప్రజలు చంద్రబాబు సారథ్యంలోని కూటమిని విశ్వసించారు. అధికారం ఇచ్చారు. టీడీపీ కూటమి ప్రభుత్వం కొలువుదీరి ఆరు మాసాలు పూర్తి చేసుకుంది. మరో ఏడు రోజుల్లో 2024 సంవత్సరం కనుమరుగై.. 2025 నవ వసంతం ఉదయించనుంది. ఈ సందర్భంగా ఏడాది ప్రారంభం ఆరు నెలల్లో వైసీపీ ప్రభుత్వం చేపట్టిన సంక్షేమం.. చివరి ఆరు నెలల్లో టీడీపీ కూటమి ప్రభుత్వం జనం మెచ్చేలా సంక్షేమంపై ఆంధ్రజ్యోతి విశ్లేషణ.

పేదల ఇంట దీపం-2 వెలుగులు

టీడీపీ కూటమి ప్రభుత్వం ఇచ్చిన 'సూపర్ సిక్స్' హామీల్లో ఒకటి దీపం-2. ఈ పథకం కింద పేదింటి మహిళలకు ఏడాదికి మూడు గ్యాస్ సిలిండర్లు ఉచితంగా ఇస్తామని హామీ ఇచ్చారు. రేషన్ కార్డు కలిగిన పేదలు అర్హులు. నవంబరు ఒకటో తారీఖు నుంచి అమలుకు శ్రీకారం చుట్టారు. భారత్, హెచ్‌పీ, ఇండెన్ గ్యాస్ కనెక్షన్లు కలిగిన 6.46 లక్షల కుటుంబాలకు ఏటేటా మూడు గ్యాస్ సిలిండర్లు అందించి దీపం-2 వెలుగులు విరబూయించే కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. ఉచిత గ్యాస్ సిలిండరు కోసం 2025 మార్చి 31వ తేది వరకు గ్యాస్ సిలిండరు బుకింగ్ చేసుకోవచ్చు. గ్యాస్ కనెక్షన్ ఉన్న తెల్లరేషన్ కార్డుదారులు అందరూ అర్హులే. 2025 ఏప్రిల్ ఒకటో తారీఖు నుంచి మూడు విడుతల్లో ఏడాది మూడు గ్యాస్ సిలిండర్ల మొత్తం రూ.2,595 (ఒక్కో సిలిండర్ రూ.865) లబ్ధిదారుడి ఖాతాలో జమ చేస్తారు. ఏప్రిల్, మే, జూన్, జూలై నెలల్లో ఒక సిలిండర్, ఆగస్టు, సెప్టెంబరు, అక్టోబరు, నవంబరు నెలల్లో రెండో సిలిండర్, డిసెంబరు, జనవరి, ఫిబ్రవరి, మార్చి నెలల్లో మూడో సిలిండర్ నగదు జమ చేస్తారు. జిల్లాలో రూ.63.83 కోట్లు ఉచిత గ్యాస్ సిలిండర్ల రూపంలో పేదలకు ఆర్థిక ప్రయోజనం అందనుంది.

కర్నూలు, డిసెంబరు 24 (ఆంధ్రజ్యోతి): 2024 సంవత్సరం ముగిసిపోనుంది. ఎవరి మనసులోనైనా ఈ ఏడాదికి సంబంధించిన ఎన్నో అనుభవాలు పదిలంగా ఉంటాయి. ఈ ఏడాది మధ్యలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చింది. వృద్ధులు, దివ్యాంగులు, వితంతువులు, ఒంటరి మహిళలు, దీర్ఘకాలిక జబ్బులతో బాధపడుతున్న అభాగ్యుల ముంగిట చంద్రోదయమే అని చెప్పాలి. ఎన్నికల ముందు వృద్ధులకు రూ.4 వేలు, దివ్యాంగులకు రూ.6 వేలు పెంచుతామని చంద్రబాబు సారథ్యంలోని టీడీపీ కూటమి స్పష్టమైన హామీ ఇచ్చింది. అంతేకాదు.. ఏప్రిల్ ఒకటో తారీఖు నుంచి పెంపును అమలు చేసి అధికారం చేపట్టగానే ఆ మూడు నెలల బకాయి కూడా చెల్లిస్తామని హామీ ఇచ్చారు. చంద్రన్న మా ఇంటి కి కొండంత అండగా ఉంటారని అభాగ్యులు విశ్వసించారు. జూన్ 12న సీఎం చంద్రబాబు బాధ్యతలు చేపట్టగానే తొలి సంతకం పింఛన్ పెంపు ఫైల్‌పైనే పెట్టారు. జూలై ఒకటో తారీఖున ఊరూ వాడా పింఛన్ల జాతర జరుపుకున్నారు. జిల్లాలో 2,45,229 మంది పింఛన్‌దారులకు పెంచిన ఫించన్‌తో కలిపి రూ.104.10 కోట్లు, మూడు నెలల బకాయి రూ.63.25 కోట్లు కలిపి రూ.167.35 కోట్లు పంపిణీ చేశారు. ప్రతి నెల ఒకటో తారీఖున సూర్యోదయం వృద్ధులు, దివ్యాంగులు, వితంతు మహిళలకు చంద్రోదయం అవుతుంది. సచివాలయం, పంచాయతీ సెక్రెటరీలు, ఎంపీడీవో ఆఫీసు జూనియర్ అసిస్టెంట్లు 4,851 మంది నెలనెల ఒకటో తారీఖు ఉదయం 6 గంటలకే వృద్ధుల ఇంటి తలుపుతట్టి పింఛన్ డబ్బులు అందజేస్తున్నారు.

జిల్లాలో పింఛన్‌దారులు, అందుకునే నెల పింఛన్ వివరాలు (రూ.లల్లో)

కేటగిరి	లబ్ధిదారులు	ఒకరికి పింఛన్	మొత్తం (రూ.కోట్లల్లో)
వృద్ధులు	1,25,848	4,000	50.34
వితంతువులు	71,498	4,000	28.60
దివ్యాంగులు	31,434	6,000	18.86
చేనేత కార్మికులు	2,945	4,000	1.18
గీత కార్మికులు	242	4,000	0.10
ట్రాన్స్ జండర్స్	241	4,000	0.09
ఒంటరి మహిళలు	5,881	4,000	2.35
మత్స్యకారులు	816	4,000	0.33
దీర్ఘకాలిక వ్యాధిగ్రస్తులు	346	10,000	0.35
డప్పు కళాకారులు	1,456	4,000	0.58
పక్షవాతం బాధితులు	781	15,000	1.17
కళాకారులు, సైనికులు	46	4,000-5,000	0.02
అభయ హస్తం	2,559	500	0.13
మొత్తం	2,45,229	---	104.10

రూ.వెయ్యి పెంచేందుకు ఐదేళ్లు



రాష్ట్ర విభజన తరువాత రూ.200 పింఛన్ ఐదు రెట్లు పెంచి రూ.1,000 చేశారు ఆనాటి సీఎం చంద్రబాబు. 2019 ఎన్నికలకు ముందు రూ.2 వేలు చేశారు. అయితే.. ఆ ఎన్నికల్లో ప్రతిపక్ష నేతగా ఉన్న జగన్ పింఛన్ రూ.3 వేలు చేస్తానని హామీ ఇచ్చారు. అధికారం చేపట్టాక మాట మార్చారు. పెంచుతూ పోతాను అంటూ రూ.వెయ్యి పెంచడానికి ఐదేళ్లు తీసుకున్నాడు. నవరత్నాలు పేరిట సంక్షేమ పాలన అంటూ అభివృద్ధికి పాతర వేశారు. ఈ ఏడాది ప్రారంభంలో గత ప్రభుత్వం అమలు చేసిన సంక్షేమ పథకాలు అన్నింటికి నిధులు పూర్తిగా ఇచ్చారా అంటే అదీలేదు. ఆరోగ్యశ్రీ, పేద విద్యార్థులకు ఇచ్చే ఫీజు రీయింబర్స్‌మెంట్.. ఇలా అన్ని సంక్షేమ పథకాలకు రూ.వేల కోట్లు బకాయిలు పెట్టి వెళ్లారు. టీడీపీ కూటమి ప్రభుత్వం వచ్చాక బకాయిలు చెల్లిస్తూ వస్తున్నది. ఏదిఏమైనా 2024 ఎన్నికల సంవత్సరం కావడంతో ఏడాది ప్రారంభం ఆరు నెలలు వైసీపీ ప్రభుత్వం.. చివరి ఆరు నెలలు టీడీపీ కూటమి ప్రభుత్వం సంక్షేమానికే పెద్దపీట వేశాయని చెప్పాలి. రెండు ప్రభుత్వాలు చెరో ఆరు నెలలు పాలించిన సంవత్సరం కూడా 2024 కావడం కొసమెరుపు.

రాష్ట్ర విభజన తరువాత పేదలు, వివిధ ఆరోగ్య సమస్యలతో ఆస్పత్రులకు వచ్చే అభాగ్యులకు రూ.5లకే కడుపు నిండా అన్నం వడ్డించి ఆకలి తీర్చాలనే లక్ష్యంగా ఆనాటి సీఎం చంద్రబాబు 'అన్న క్యాంటీన్లు' ఏర్పాటు చేశారు. రోజులు వేలాది మంది పేదల ఆకలి తీర్చారు. 2019 మేలో కొలుదీరిన జగన్ సారథ్యంలో వైసీపీ ప్రభుత్వం అన్న క్యాంటిన్లు మూసేసింది. మళ్లీ చంద్రబాబు సారథ్యంలోని టీడీపీ కూటమి ప్రభుత్వం రావడం.. అన్న క్యాంటిన్లు ఏర్పాటయ్యాయి. అభాగ్యులకు అన్నం పెట్టి ఆకలి తీర్చే అన్న క్యాంటిన్ల పునఃప్రారంభానికి 2024

పేదల ఆకలి తీరుస్తున్న అన్న క్యాంటిన్లు

సంవత్సరం వేదిక కావడం.. రాబోయే రోజుల్లో అన్న క్యాంటిన్లు గుర్తు చేసుకున్న ప్రతిసారి 2024ను స్మరించుకోక తప్పదు. కర్నూలు నగరంలో కలెక్టరేట్, ప్రభుత్వ సర్వజన వైద్యశాల, పాతబస్టాండ్, ఇండస్ట్రియల్ ఎస్టేట్, ఉల్చాల రోడ్డులో అన్న క్యాంటిన్లు ఏర్పాటు చేశారు. ఒక్కో క్యాంటిన్‌లో రోజూ ఉదయం, మధ్యాహ్నం, రాత్రి మూడు పూటల సుమారు 600-750 మందికిపైగా ఒక పూటకు రూ.5లకే టిఫిన్, అన్నం వడ్డించి ఆకలి తీరుస్తున్నారు. ఎమ్మిగనూరు పట్టణంలో సోమప్ప సర్కిల్, శ్రీనివాస్ సర్కిల్, ఆదోని పట్టణంలో స్త్రీలు, చిన్న పిల్లల ఆస్పత్రి, పాత బస్టాండ్ సర్కిల్, పోస్ట్ ఆఫీస్ (రైల్వే ఫ్లై ఓవర్ బిడ్జి దిగువన) అన్న క్యాంటిన్లు ఏర్పాటు చేశారు. రోజుకు ఒక్కో అన్న క్యాంటిన్‌లో దాదాపు 500-600 మందికి పైగా ఆకలి తీరుతోంది.



టిడ్కో ఇళ్లు ఎప్పుడిస్తారు?



తాగునీటి కోసం అవస్థలు

నగరానికి దూరంగా టిడ్కో ఇళ్లు కట్టించారు. 2,065 మంది లబ్ధిదారులకు ఇళ్లు అప్పగిస్తే 65 కుటుంబాలు కూడా నివాసం లేవు. రాత్రి కరెంట్ సక్రమంగా ఉండడం లేదు. పాముల బెడద తీవ్రంగా ఉంది. తాగునీటి కోసం తీవ్ర ఇబ్బందులు పడుతున్నాం. రెండు మూడు రోజులకు ఒకసారి ట్యాంకుతో నీళ్లు పోసి వెళ్తున్నారు. ఆ నీరు కూడా శుభ్రంగా లేవు. ఖాళీ చేసే వెళ్దామని అనుకుంటున్నాం.

- బి.శేఖర్, టిడ్కో కాలనీ, కర్నూలు

(5వ పేజీ తరువాయి)

నగరం, పట్టణాలకు దూరంగా టిడ్కో ఇళ్లు నిర్మించారు. తాగునీరు, రహదారులు, పట్టణాల్లో పనులకు వెళ్లాలంటే రవాణా, పిల్లలకు పాఠశాలలు, ఆస్పత్రులు వంటి కనీస వసతులు మృగ్యమయ్యాయి. దీంతో ఇళ్లు ఇచ్చినా నివసించేందుకు పేదలు భయందోళన వ్యక్తం చేస్తున్నారు. కర్నూలు నగరానికి దాదాపు 8-10 కి.మీల దూరంలో కర్నూలు-నంద్యాల జాతీయ రహదారి బైపాస్ రోడ్డు పక్కనే జగన్నాథగట్టుపై 10 వేల ఇళ్లు నిర్మాణం చేపడితే.. 8,829 ఇళ్లు పూర్తి చేశామని, 2,064 మంది లబ్ధిదారులకు ఇళ్లను అప్పగించామని ఇంజనీర్లు తెలిపారు. అయితే.. కనీస వసతులు లేకపోవడంతో 65 కుటుంబాలు కూడా నివసించడం లేదు. వారు కూడా ఖాళీ చేసి వెళ్లిపోయేందుకు సిద్ధం అవుతున్నారు. ఎమ్మిగనూరు పట్టణం శివన్న నగరంలో 1.920 ఇళ్లు లబ్ధిదారులకు అప్పగిస్తే 25 కుటుంబాలకు మించి నివసించడం లేదు. ఆదోనిలో 1,632 ఇళ్లు అప్పగిస్తే వాటిలో ఒక్క కుటుంబం కూడా ఉండటం లేదు. నంద్యాలలో 2,096, ఆళ్లగడ్డలో 1,392 ఇళ్లు లబ్ధిదారులకు అప్పగిస్తే కనీస వసతులు లేక ఆ ఇళ్లలో ఉండేందుకు లబ్ధిదారులు ఆసక్తి చూపడం లేదు. తాగునీటి పైపులైన్లు, ఓహెచ్‌ఆర్ ట్యాంకుల నిర్మాణాలు అసంపూర్తిగా ఉన్నాయి. మౌలిక వసతులకు కర్నూలు జిల్లాలో రూ.33.73 కోట్లు, నంద్యాల జిల్లాలో 16.10 కోట్లు అవసరమని అధికారులు పేర్కొంటున్నారు.

కరెంట్ లేదు.. తాగునీరు రావడం లేదు

టిడ్కో కాలనీలో నా భార్య పేరిట ఇల్లు మంజూరు అయ్యింది. రెండో అంతస్తులో ఇల్లు ఇచ్చారు. మగ్గం నేస్తేనే మాకు పూట గడిచేది. మగ్గం షెడ్డు నిర్మించి ఇవ్వలేదు. కరెంట్ లేదు. తాగునీరు రావడం లేదు. తీవ్ర ఇబ్బందులు పడుతున్నాం.

- గణపతి రవి, టిడ్కో కాలనీ, ఎమ్మిగనూరు

ఆరు నెలలైనా..

కూటమి ప్రభుత్వం జూన్ 12న కొలువుదీరింది. టిడ్కో ఇళ్ల తాజా పురోగతిపై అదే నెలలో సర్వే చేయడంతో లబ్ధిదారుల్లో ఆశలు చిగురించాయి. అయితే.. ఐదు నెలలు గడిచినా పంపిణీ చేయకపోగా మౌలిక వసతులపై దృష్టి సారించలేదు. కనీసం ముళ్ల పొదలు కూడా తొలగించలేదు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి కనీస సౌకర్యాలు కల్పించి ఇళ్లు పంపిణీ చేయాలని లబ్ధిదారులు కోరుతున్నారు.

వసతులు ఏర్పాటు చేయాలి



అన్ని ఏర్పాట్లు చేశామంటూ గతేడాది వైసీపీ ప్రభుత్వం మాకు ఇంటిని అప్పగించింది. అంతా బాగుందన్న భావనతో ఇక్కడకు వచ్చి నివాసం ఉంటున్నాం. తీరా చూస్తే సదుపాయాలు సరిగా లేవు. తాగునీటికి కూడా ఇబ్బంది పడాల్సిన పరిస్థితి ఏర్పడింది. నీటికోసం రోజూ వంద రూపాయలు ఖర్చు చేయాల్సి వస్తోంది. పేదలమైన తాము తాగేందుకు నెలకు రూ.3 వేలు ఖర్చు చేస్తే మిగిలేన వాటిని కొనేదెలా? ప్రస్తుత టీడీపీ ప్రభుత్వం పూనుకుని అన్ని వసతులు ఏర్పాటు చేయాలి.

- ప్రసాద్, టిడ్కో లబ్ధిదారుడు, ఎస్సార్బీసీ కాలనీ, నంద్యాల.

రాకపోకలకు ఇబ్బందే



ఇక్కడ వసతులు ఏమీ లేవు. అన్నింటికి టౌనులోనికి పోవాల్సిన పరిస్థితి. ఆటో వాళ్లు ఇక్కడికి రావాలంటే రూ.100కు పైనే అడుగుతున్నారు. ఇక సాయంత్రం ఆరు దాటిందంటే రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు కలుగుతున్నాయి. ఇలాంటి పరిస్థితుల్లో ఇక్కడ నివాసం ఉండెదెలా? అద్దె భారం తగ్గుతుందని, సొంత ఇల్లు అని ఉండాల్సి వచ్చినా, సరైన సౌకర్యాలు లేక ఇబ్బంది పడుతున్నాం. కూటమి ప్రభుత్వం కాలనీలో నివాసముంటున్న వారికి ఇబ్బంది లేకుండా సదుపాయాలు కల్పించాలి.

- షేక్షావలి, టిడ్కో లబ్ధిదారుడు, ఎస్సార్బీసీ కాలనీ, నంద్యాల

బస్సు లేదు.. నీళ్లు రావు

నగరంలో అద్దె కట్టలేక రెండేళ్ల క్రితం ఇక్కడికి వచ్చాం. బస్సు సౌకర్యం లేదు. పనులకు, పిల్లలను బడికి పంపడానికి తీవ్ర ఇబ్బందులు పడుతున్నాం. రాత్రివేళ రావాలంటే ఎన్నో అవస్థలు. పిల్లలను బడికి పంపాలంటే నెలకు ఆటో బాడుగ రూ.1,500 వరకు చెల్లించాల్సి వస్తున్నది. ఇక్కడికి వచ్చి వృద్ధులకు పింఛన్లు ఇవ్వడం లేదు. రేషన్ వాహనం రావడం లేదు. రాత్రిళ్లలో గుర్తు తెలియని వ్యక్తులు తిరుగుతున్నారు. పెట్రోలింగ్ పెట్టాలని కోరినా పట్టించుకోవడం లేదు.

- ఈశ్వర్, టిడ్కో కాలనీ, కర్నూలు

ఉమ్మడి జిల్లాలో టీడీపీ ఇళ్ల పురోగతి వివరాలు

నగరం/పట్టణం	అగ్రిమెంట్ అయిన ఇళ్లు	పనులు మొదలు పెట్టిన ఇళ్లు	పూర్తైన ఇళ్లు	లబ్ధిదారులకు అప్పగించిన ఇళ్లు
● కర్నూలు జిల్లా:				
కర్నూలు నగరం	10,000	10,000	8,829	2,064
ఆదోని	4,704	4,720	3,494	1,632
ఎమ్మిగనూరు	4,272	4,272	4,272	1,920
మొత్తం	18,976	18,992	16,595	5,616
● నంద్యాల జిల్లా:				
నంద్యాల పట్టణం	10,000	9,000	5,370	2,096
డోన్	306	288	288	–
ఆళ్లగడ్డ	2,304	1,392	1,392	1,392
మొత్తం	12,610	11,680	7,050	3,488

కానుగ ఆకుపై కరుణామయుడు



ప్యాపిలి మండలంలోని వెంగళాంపల్లి గ్రామానికి చెందిన చిత్రకారుడు మధుక్రిష్ణ కానుగ ఆకుపై యేసుప్రభు చిత్రం వేశారు. బుధవారం క్రిస్మస్ పండుగను పురస్కరించుకొని ఆయన ఈ చిత్రం గీశారు. చిత్రం ఆకర్షణీయంగా ఉండటంతో గ్రామస్తులు మధుక్రిష్ణను అభినందించారు.

- ప్యాపిలి(ఆంధ్రజ్యోతి).

హక్కులపై అవగాహన తప్పనిసరి

జాయింట్ కలెక్టర్ విష్ణుచరణ్

నంద్యాల కల్చరల్, డిసెంబరు 24 (ఆంధ్రజ్యోతి): ప్రతి వినియోగదారుడు తమకు ఉన్న హక్కులపై అవగాహన కలిగి ఉండాలని జాయింట్ కలెక్టర్ విష్ణుచరణ్ పిలుపునిచ్చారు. మంగళవారం కలెక్టరేట్‌లోని వీడియో కాన్ఫరెన్స్ హాల్‌లో జిల్లా పౌరసరఫరాల ఇన్‌చార్జి అధికారి రాజు అధ్యక్షతన నిర్వహించిన ఈ కార్యక్రమానికి జేసీ హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వినియోగదారుల సంక్షేమం, వారి హక్కులపై అవగాహన కల్పించేందుకు ప్రతిఏటా ఇలాంటి కార్యక్రమాలను ప్రభుత్వం నిర్వహిస్తోందన్నారు. వినియోగదారులు డిజిటల్ లావాదేవీలు చేసేటప్పుడు జాగ్రత్తలు పాటించాలన్నారు. కొనుగోలు చేసిన వస్తు సేవల విషయంలో మోసపోతే అందుబాటులో ఉన్న పరిష్కార వేదికలను ఆశ్రయించాలన్నారు. ఈ కార్యక్రమంలో సివిల్ సప్లైస్ అధికారులు, జిల్లా వినియోగదారుల అధ్యక్షుడు అమీర్‌బాషా, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న జాయింట్ కలెక్టర్ విష్ణుచరణ్

27న కొబ్బరి సాగుపై అవగాహన సదస్సు

నంద్యాల రూరల్, డిసెంబరు 24 (ఆంధ్రజ్యోతి): నంద్యాల పట్టణంలోని నూనెపల్లెలో వైఎస్సార్ సెంటినరీ హాల్‌లో ఈనెల 27న కొబ్బరి సాగుపై జిల్లాస్థాయి అవగాహన సదస్సు నిర్వహిస్తున్నట్లు జిల్లా ఉద్యాన శాఖ అధికారి నాగరాజు తెలిపారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ అవగాహన సదస్సులో ఉద్యానశాఖ యూనివర్సిటీ శాస్త్రవేత్తలు, కోకోనట్ బోర్డు డైరెక్టర్లు హాజరవుతారని చెప్పారు. కొబ్బరి సాగులో మెళకువలను, నూతన సాంకేతిక పద్ధతులను శాస్త్రవేత్తలు రైతులకు వివరిస్తారన్నారు. కొబ్బరి బోర్డు రైతులకు అందజేస్తున్న పథకాలను, రాయితీ గురించి బోర్డు డైరెక్టర్లు తెలియజేస్తారని తెలిపారు. రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

మట్కా బీటర్ల అరెస్టు

• 1.02 లక్షల నగదు స్వాధీనం

నంద్యాల క్రైం, డిసెంబరు 24 (ఆంధ్రజ్యోతి): నంద్యాల ఎస్పీ అధిరాజ్ సింగ్ రాణా ఆదేశాల మేరకు జిల్లాలో అసాంఘిక కార్యకలాపాల నియంత్రణలో భాగంగా త్రీ టౌన్ సీఐ సూర్యమౌళి, ఎస్ఐ సత్యనారాయణ తమ సిబ్బందితో ఇద్దరు మట్కా బీటర్లను అరెస్టు చేశారు. పోలీస్ అధికారులు మంగళవారం చేపట్టిన విస్తృత తనిఖీల్లో భాగంగా నంద్యాల పట్టణం నూనెపల్లె జిలేబి సెంటర్ వద్ద ఇద్దరు వ్యక్తులు మట్కా ఆడేందుకు ప్రజలను ప్రేరేపించి వారి వద్ద నుంచి డబ్బులు వసూలు చేస్తుండగా అరెస్టు చేశారు. వారి వద్ద నుంచి మట్కాకు సంబంధించిన చీటీలతో పాటు రూ.1,02,070నగదును స్వాధీనం చేసుకున్నట్లు సీఐ తెలిపారు. పట్టణంలోని కొలిమిపేటకు చెందిన షేక్ జమాల్‌బాషా, మహానంది మండలం బుక్కాపురం గ్రామానికి చెందిన బొగ్గు నాగేంద్రుడును అరెస్టు చేసినట్లు సీఐ తెలిపారు.

28న స్థాయి సంఘాల సమావేశాలు

కర్నూలు, న్యూసిటీ, డిసెంబరు 24(ఆంధ్రజ్యోతి): జిల్లా పరిషత్ స్థాయి సంఘాల సమావేశాలు ఈ నెల 28న నిర్వహించనున్నట్లు సీఈఓ జి.నాసరరెడ్డి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లా పరిషత్‌లోని సీసీఓ చాంబర్‌లో ఏడు స్థాయిసంఘ సమావేశాలు నిర్వహిం చేందుకు అధికారులు ఏర్పాట్లు పూర్తిచేసారని తెలిపారు. ఉదయం 10.30 గంటల నుండి 11.30 గంటల వరకు 2వ స్థాయి సంఘం, 11.30 నుండి 12.00 గంటల వరకు 3వ స్థాయి సంఘం, 12.30 గంటల నుండి 1.30 గంటల వరకు 6వ స్థాయి సంఘం, మధ్యాహ్నం 1.30 నుంచి 2.30 గంటల వరకు 4వస్థాయి సంఘం, 3.00 గంటల నుంచి 4.00 వరకు 5వ స్థాయి సంఘం, 4.00 నుంచి 6.00 వరకు 1, 7వ స్థాయి సంఘాల సమావేశాలు నిర్వహించనున్నట్లు సీఈఓ పేర్కొన్నారు.

కౌన్సిల్‌లో రసాభాస

• అభివృద్ధి నిధుల మంజూరుపై టీడీపీ, వైసీపీ సభ్యుల వాగ్వాదం
• టీడీపీ సభ్యులకు అడ్డుపడిన మున్సిపల్ వైస్ చైర్మన్ నజీర్
• ప్రజా సమస్యలను గాలికి వదిలిన కౌన్సిల్ సభ్యులు



మున్సిపల్ వైస్ చైర్మన్ నజీర్‌ను కూర్చోవాలని చెబుతున్న చైర్మన్ డాక్టర్ రఘు



మాట్లాడుతున్న టీడీపీ కౌన్సిలర్లు

ఎమ్మిగనూరు, డిసెంబరు 24(ఆంధ్రజ్యోతి): పట్టణాభివృద్ధికి తమ ఎమ్మెల్యే హయాంలో నిధులు మంజూరయ్యాయని టీడీపీ కౌన్సిలర్ అంటే.. లేదు తమ ఎమ్మెల్యే హయాంలో కూడా మంజూరయ్యాయని వైసీపీకి చెందిన వారు తలపడ్డారు. మంగళవారం పట్టణంలోని మున్సిపల్ కౌన్సిల్ హాల్‌లో చైర్మన్ డాక్టర్ రఘు అధ్యక్షతన కౌన్సిల్ సాధారణ సమావేశం నిర్వహించారు. సమావేశం ప్రారంభంలో ఒకట్రెండు అంశాలు చదువుతుండగానే మున్సిపల్ వైస్ చైర్మన్ నజీర్ అహ్మద్‌లేచి అజెండాలో ప్రవేశపెట్టిన అంశాలను టేబుల్ అజెండాను ఆమోదిస్తున్నామని చెప్పారు. అటు తర్వాత వైస్ చైర్మన్ మాట్లాడుతూ క్రిస్మస్, నూతన సంవత్సరం, పట్టణ జాతర శుభాకాంక్షలను కౌన్సిల్ సభ్యులకు అధికారులకు పట్టణ ప్రజలకు తెలిపారు. అలాగే మాజీ ఎమ్మెల్యే చెన్నకేశవరెడ్డి హయాంలో పలు అభివృద్ధి కార్యక్రమాలకు నిధులు మంజూరు చేయించి పట్టణంలో శాశ్వత అభివృద్ధి పనులు చేపట్టినట్లు తెలిపారు.

అనంతరం టీడీపీ ఫ్లోర్ లీడర్ దయాసాగర్ మాట్లాడుతూ ఎమ్మెల్యే బీవీ జయనాగేశ్వర రెడ్డి, సీఎం చంద్రబాబు నాయుడు తరపున కౌన్సిల్ సభ్యులకు, అధికారులకు, ప్రజలకు నూతన సంవత్సర, క్రిస్మస్, జాతర శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత ప్రభుత్వ హయాంలో కొన్ని నిధులు మంజూరైన మాట వాస్తవమేనని, అయితే కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఎమ్మెల్యే బీవీ జయనాగేశ్వరరెడ్డి పట్టణంలో రూ.40లక్షలతో సెంట్రల్ లైటింగ్, నిలిచి పోయిన ఏఐఐబీ నిధులను రూ.146 కోట్లు తిరిగి మంజూరు చేయించారని చెబుతుండగా వైస్ చైర్మన్ అడ్డు తగులుతూ ఏ నిధులు ఎప్పుడు మంజూరు చేశారని, ఏ శాఖ నుంచి నిధులు వచ్చాయని, తాము అభివృద్ధి చేస్తే మీరు చెప్పుకోవడం ఏమిటని అడ్డుతగిలారు. దీనికి దయాసాగర్‌తో పాటు టీడీపీ కౌన్సిలర్లు స్పందించారు. ఈ సందర్భంగా టీడీపీ, వైసీపీ సభ్యుల మధ్య తీవ్ర వాగ్వాదం, అరుపులు, కేకలతో కొద్దిసేపు కౌన్సిల్ సమావేశం రసాభాసగా మారింది. ఎవరు ఏం మాట్లాడుతున్నారో గందరగోళ పరిస్థితి నెలకొంది. దీంతో చైర్మన్ డాక్టర్ రఘు కల్పించుకున్నా పరిస్థితి సర్దుమణగలేదు. దీంతో చైర్మన్ డాక్టర్ రఘు సమావేశాన్ని ముగించి పోడియం దిగి వెళ్లిపోయారు. ఈ సమావేశంలో వైస్ చైర్మన్ దివ్యకళ, మున్సిపల్ కమిషనర్ గంగిరెడ్డి, కౌన్సిలర్లు నాగేశప్ప, కాశింబేగ్, బజారి, కేశవరెడ్డి, రాజారత్నం, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

నాలుగు నెలలుగా ఇంతే!

గడచిన నాలుగు నెలలుగా కౌన్సిల్ సమావేశంలో ఇరు పార్టీల కౌన్సిలర్లు ఏదో ఒక అంశంపై అనవసరంగా వాగ్వాదం చేసుకోవడం..పావుగంట..అరగంటలోపు సమావేశాన్ని ముగించడం తంతుగా మారింది. సమస్యలను చర్చించకుండా రభస సృష్టిస్తున్న కౌన్సిల్ సభ్యులపై పట్టణ ప్రజలు తీవ్రంగా మండిపడుతున్నారు.

చెరువులు, వాగులను రక్షించండి

• మత్స్యకారుల జీవనోపాధిని కాపాడండి
• మత్స్యకారుల సంఘం నగర అధ్యక్షుడి విజ్ఞప్తి



జలమండలి వద్ద ధర్నా చేస్తున్న మత్స్యకారులు

కర్నూలు అగ్రికల్చర్, డిసెంబరు 24 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి కర్నూలు, నంద్యాల జిల్లాల్లో చెరువులను కాపాడాలని మత్స్య శాఖ సంఘం నగర అధ్యక్షుడు శ్రీనివాసులు డిమాండ్ చేశారు. మంగళవారం వివిధ ప్రజా సంఘాలు జలమండలి కార్యాలయం వద్ద నిరసన చేపట్టారు. చెరువులను కబ్జా చేసి మత్స్యకారులను, రైతులను ఆర్థిక ఇబ్బందులకు గురి చేస్తున్న భూస్వాములు, రాజకీయ నాయకులు, రియల్ ఎస్టేట్ దారుల అక్రమాలను అరికట్టాలని అన్నారు. చెరువుల కబ్జాల వల్ల మత్స్యకారులు జీవనోపాధి కోల్పోతున్నారని ఆరోపించారు. కులవివక్ష వ్యతిరేక సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు క్రిష్ణ మాట్లాడుతూ 40 ఏళ్లుగా దళితుల అనుభవంలో ఉన్న చెరువు భూమిని బిల్డర్లు ఆక్రమించుకున్నారని ఆరోపించారు. దీనిపై ప్రభుత్వం వెంటనే స్పందించాలన్నారు. పట్టణ పౌర సంఘం నాయకులు ఇరిగినేని పుల్లారెడ్డి, నాగరాజు, వివిధ కాలనీల అసోసియేషన్ల ప్రతినిధులు శ్రీనివాసరెడ్డి, వన్నూరు సాహెబ్ మాట్లాడుతూ బ్రిటీష్ కాలం నాటి చెరువులను, వాగులను, నదుల పరిసరాలను బిల్డర్లు రియల్ ఎస్టేట్ వ్యాపారులు కబ్జా చేసి వ్యాపారం చేస్తుంటే పాలకులు ప్రభుత్వ అధికారులు ఎందుకు స్పందించడం లేదని ప్రశ్నించారు. పంట పొలాలకు, తాగునీరుకు, బోరింగులకు ఆధారంగా ఉన్న చెరువులను కాపాడాలని కోరారు. గార్గేయపురం చెరువు సమీపంలో ఇరిగేషన్ అధికారులు వేసిన సిమెంటు రోడ్డు కబ్జాకు గురైందని, వెంటనే ఆ స్థలాన్ని కాపాడాలని నీటి పారుదల శాఖ డీఈ సుష్మకు వినతి పత్రం అందించారు. ఈ ధర్నాలో బీఎస్ఎన్ఎల్ పెన్షనర్ల అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు యాకోబు, నాగేంద్ర, గురుస్వామి, యూనుస్, పీటర్, గౌడ్, రెహమాన్, రుస్తుం తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి

డోన్ రూరల్, డిసెంబరు 24 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కొత్తపల్లి గ్రామానికి చెందిన రమీజ్ (30) సోమవారం అర్ధరాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. ఈ ఘటన మంగళవారం జరిగింది. డోన్ పట్టణం గుత్తిరోడ్డులో రహదారి మరమ్మతుల్లో భాగంగా రోడ్డు పక్కన గుంతలు తీశారు. కొత్తపల్లి గ్రామానికి చెందిన రమీజ్ తన స్నేహితులతో బైక్‌పై సోమవారం రాత్రి వెళ్తూ గుంతను గమనించక ప్రమాదవశాత్తు గుంతలో పడి మృతి చెందాడు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు. విషయం తెలుసుకున్న డోన్ టీడీపీ యువ నాయకులు ధర్మవరం గౌతమ్ రెడ్డి మృతుని స్వగృహానికి వెళ్లి ఆయన కుటుంబానికి ప్రగాఢ సానుభూతిని తెలిపారు. మృతుని భౌతిక కాయానికి నివాళులర్పించారు. వైసీపీ నాయకులు డోన్ ప్రభుత్వ ఆసుపత్రి మార్చురీలో మృతదేహాన్ని చూసి నివాళులర్పించి కుటుంబ సభ్యులను పరామర్శించారు. డోన్ ఎంపీపీ రేగటి రాజశేఖర్ రెడ్డి, రాష్ట్ర మీట్ కార్పొరేషన్ మాజీ చైర్మన్ శ్రీరాములు తదితరులు ఇందులో ఉన్నారు.



నివాళి అర్పిస్తున్న టీడీపీ నాయకుడు ధర్మవరం గౌతమ్ రెడ్డి

విద్యుదాఘాతంతో గొర్రెల కాపరి..



రామాంజనేయులు (ఫైల్)

తుగ్గలి, డిసెంబరు 24 (ఆంధ్రజ్యోతి): జి.ఎర్రగుడికి చెందిన గొర్రెల కాపరి బసప్పగారి రామాంజనేయులు (22) విద్యుత్ తీగలు తగిలి మృతి చెందాడు. వివరాలివి.. మండలంలోని జి.ఎర్రగుడి, జొన్నగిరి తాండా గ్రామాల మధ్య ఓ రైతు పొలంలో మిషన్‌తో కంది పంట కోతను చేపడుతున్నారు. అక్కడే గొర్రెలు మేపుతున్న రామాంజనేయులు మిషన్‌పైకి ఎక్కాడు. హైటెన్షన్ వైర్లు తాకడంతో యువకుడి కింద పడ్డాడు. రైతులు చికిత్స నిమిత్తం గుత్తి వైద్యశాలకు తరలించగా.. అప్పటికే రామాంజనేయులు మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. జొన్నగిరి ఎస్ఐ విజయశేఖర్ ఘటనా స్థలాన్ని పరిశీలించడంతో పాటు వైద్యశాలకు వెళ్లి మృతదేహాన్ని పరిశీలించారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నామని ఆయన చెప్పారు. రామాంజనేయులుకు భార్య శిరీష, ఏడాది కుమారుడు ఉన్నారు.

చికిత్స పొందుతూ వ్యక్తి..

ఎమ్మిగనూరు, డిసెంబరు 24(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని వీవర్స్ కాలనీ వాసి రాఘవేంద్ర(44) నిప్పటించుకొని ఆత్మహత్య యత్నం చేసి చికిత్స పొందుతూ మృతి చెందాడు. రాఘవేంద్ర చిన్న కిరాణ దుకాణాన్ని నిర్వహించేవాడు. దుకాణంలో నష్టాలు రావటంతో అప్పులు పెరిగాయి. దీంతో తన తండ్రికి వచ్చే పెన్షన్‌తో జీవించేవాడు. రెండు వారాల క్రితం తండ్రి మృతి చెందాడు. ఆర్థిక ఇబ్బందులు ఎక్కువ కావడంతో మానసిక వేదనకు లోనై సోమవారం వేకువజామున ఇంట్లో ఒంటిపై పెట్రోల్ పోసుకొని ఆత్మహత్య యత్నం చేశాడు. కుటుంబసభ్యులు వెంటనే ఆసుపత్రికి తరలించారు. మెరుగైన వైద్యం కోసం కర్నూలు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ కోలుకోలేక మంగళవారం మృతి చెందాడు. పట్టణ పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

విద్యార్థినిపై లెక్చరర్ లైంగిక వేధింపులు

• ఒక ప్రైవేటు కళాశాలలో ఉదంతం
• ఆలస్యంగా వెలుగులోకి
• నిందితుడిపై పోక్సో కేసు నమోదు



రోడ్డుపై బైఠాయించిన ఏఐఎస్ఎఫ్ నాయకులు

కోడుమూరు, డిసెంబరు 24(ఆంధ్రజ్యోతి): కోడుమూరులోని ఒక ప్రైవేటు కళాశాలలోని ఇంటర్ విద్యార్థినిపై కంప్యూటర్ లెక్చరర్ లైంగిక వేధింపులకు పాల్పడిన ఘటన మంగళవారం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. ఇంటర్ ద్వితీయ సంవత్సరం విద్యార్థిని సోమవారం మధ్యాహ్నం క్లాస్ రూంలో ఒంటరిగా ఉన్న సమయంలో కంప్యూటర్ లెక్చరర్‌గా విధులు నిర్వహిస్తున్న కర్నూలుకు చెందిన భాస్కర్ అసభ్యకరంగా ప్రవర్తించినట్లు తెలిసింది. లెక్చరర్ నుంచి విద్యార్థిని తప్పించుకొని పక్కనే ఉన్న మరో క్లాసు రూంలోకి వెళ్లిపోయింది. మంగళవారం తోటి విద్యార్థులకు చెప్పడంతో వెలుగులోకి వచ్చింది. విషయం తెలుసుకొన్న ఏఐఎస్ఎఫ్ నాయకుడు రంగస్వామి ఆధ్వర్యంలో కళాశాల వద్ద దర్నా, రాస్తారోకో చేపట్టారు. విద్యార్థిని ఫిర్యాదు మేరకు ఎస్ఐ ఏపీ శ్రీనివాసులు కేసు నమోదు చేశారు. పోలీసులు సీసీ పుటేజీలను పరిశీలించారు. విద్యార్థిని ఉన్న క్లాసు రూంలోకి భాస్కర్ వెళ్లడం, కొన్ని సెకండ్లలో విద్యార్థిని బయటికి రావడం రికార్డు అయింది. ఆధారాలు దొరకడంతో నిందితుడిపై పోక్సో కేసు నమోదు చేశామని ఎస్ఐ తెలిపారు.

ముద్దాయిలు సత్ప్రవర్తనతో మెలగాలి

• ఆదోని సబ్ జైలును తనిఖీ చేసిన జిల్లా న్యాయాధికారి



కోర్టు భవనాలను పరిశీలిస్తున్న న్యాయాధికారి

ఆదోని రూరల్ డిసెంబరు 24 (ఆంధ్రజ్యోతి): ముద్దాయిలు సత్ప్రవర్తనతో మెలగాలని కర్నూలు జిల్లా ప్రధాన న్యాయమూర్తి జి.కపర్ది తెలి పారు. మంగళవారం న్యాయాధికా రులు, న్యాయవాదులతో కలిసి ఆదోని సబ్‌జైలును తనిఖీ చేశారు. జైలులో ఇస్తున్న ఆహారంపై ఆరా తీశారు. 41 మంది ముద్దాయిలు ఉన్నారని జైలు సూపరింటెండెంట్ నజీర్ అహ్మద్ తెలిపారు. న్యాయవాదులను ఏర్పాటు చేసుకోలేని వారికి కోర్టు తరపున ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చారు.

అనంతరం కోర్టు నూతన భవనాలను భవనాలను జిల్లా జడ్జి కపర్ది బార్ అసోసియేషన్ అధ్యక్షుడు సుందర్ సింగ్, వైస్ ప్రెసిడెంట్ మొలగవల్లి జనార్దన్ న్యాయవాదులతో కలిసి పరిశీలించారు.

ఈతకు వెళ్లి ఇంజనీరింగ్ విద్యార్థి మృతి



పెద్దాసుపత్రి మార్చురీ వద్ద ఆందోళన చేస్తున్న నాయకులు

కర్నూలు క్రైం, హాస్పిటల్, డిసెంబరు 24 (ఆంధ్రజ్యోతి): ఉలిందకొండ పోలీస్ స్టేషన్ పరిధిలోని కేవీ సుబ్బారెడ్డి ఇంజనీరింగ్ కాలేజీ విద్యార్థి రాంప్రసాద్ రెడ్డి (19) ఈతకు వెళ్లి మృతి చెందాడు. బేతంచెర్ల మండలం ముద్దవరం గ్రామానికి చెందిన సుబ్బారెడ్డి దంపతులకు నలుగురు కూతుళ్లు, కొడుకు సంతానం. రాంప్రసాద్ రెడ్డి చివరివాడు. కేవీ సుబ్బారెడ్డి ఇంజనీరింగ్ కాలేజీలో బీటెక్ మొదటి సంవత్సరం చదువుతున్నాడు. సోమవారం మధ్యాహ్నం మిత్రులు పది మందితో కలిసి కాలేజీ వెనుక ఉన్న బావి వద్దకు ఈతకు వెళ్లాడు. ప్రమాదవశాత్తు బావిలో మునిగి మృతి చెందాడు. స్థానికుల సమాచారంతో పోలీసులు మృతదేహాన్ని బయటకు తీసి మార్చురీకి తరలించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిర్వహించి బంధువులకు అప్పగిం చారు. బంధువుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఉలిందకొండ ఎస్ఐ ధనుంజయ తెలిపారు.

మార్చురీ ఎదుట యువజన, విద్యార్థి సంఘాల ఆందోళన

రాంప్రసాద్ రెడ్డి మృతిపట్ల విద్యార్థి, యువజన సంఘాలు భగ్గుమన్నాయి. కర్నూలు ప్రభుత్వ వైద్యశాల మార్చురీ వద్ద విద్యార్థి తల్లిదండ్రులు, బంధువులతో కలిసి ఆందోళన చేపట్టాయి. డీవైఎఫ్ఐ కార్యదర్శి నగేష్, ఎస్ఎఫ్ఐ కార్యదర్శి అబ్దుల్లా, ఐసా కార్యదర్శి నాగరాజు మాట్లాడుతూ హాస్టల్‌లో సెక్యూరిటీ అధ్వా నంగా ఉందని ఆరోపించారు. విద్యార్థి మృతి చెందిన విషయాన్ని యాజమాన్యం వెంటనే తల్లిదండ్రులకు ఎందుకు చెప్పలేదని ప్రశ్నించారు.

బీసీల సంక్షేమానికి చంద్రబాబు చొరవ

• టీడీపీ రాష్ట్ర కార్యదర్శి వై. నాగేశ్వరరావు



మాట్లాడుతున్న వై. నాగేశ్వరరావు

కర్నూలు అర్బన్, డిసెంబర్ 24(ఆంధ్రజ్యోతి): ఎన్నికల ప్రచారంలో బీసీల సంక్షేమంపై ఇచ్చిన హామీలు, పథకాల అమలుకు సీఎం చంద్రబాబు చొరవ చూపుతున్నారని టీడీపీ రాష్ట్ర కార్యదర్శి, బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు వై.నాగేశ్వరరావు కృతజ్ఞతలు తెలిపారు. మంగళవారం జిల్లా టీడీపీ కార్యాలయంలో బీసీ సెల్ నాయకులు విలేకరుల సమావేశం నిర్వహించారు. బీసీల సంక్షేమానికి తెలుగుదేశం పార్టీ మాత్రమే ప్రాధాన్యం ఇస్తోందన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా బీసీ సంక్షేమ హాస్టళ్లకు సంబంధించి గత ప్రభుత్వం పెట్టిన రూ. 110 కోట్ల బకాయిల్లో ఇప్పటికే రూ.76.38 కోట్లు కూటమి ప్రభుత్వం చెల్లించిందన్నారు. ప్రభుత్వం చెల్లించగా పెండింగ్ ఉన్న రూ.34.14 కోట్లను త్వరలో చెల్లించాలని ఆదేశించారని గుర్తు చేశారు. 2024-25 విద్యానంవత్సరానికి బడ్జెట్‌లో ప్రభుత్వం రూ.135 కోట్లు కేటాయించిందన్నారు. స్కిల్ ఎడ్యుకేషన్‌లో భాగంగా స్పోకెన్ ఇంగ్లీష్, సోషల్ ఎమోషనల్, నైతిక విలువలు, నీతి శాస్త్రం, డిజిటల్ లీటరసిపై బీసీ విద్యార్థులకు శిక్షణకు ప్రభుత్వం సిద్ధమైందన్నారు. 26 జిల్లాల్లో 104 బీసీ హాస్టళ్లలో పైలట్ ప్రాజెక్టులుగా అమలు చేయనున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో బీసీ సెల్ జిల్లా అధ్యక్షుడు సత్రం రామకృష్ణ, బీసీ నాయకులు మాల కార్పొరేషన్ డైరెక్టర్ పోతురాజు రవికుమార్, మాదిగ కార్పొరేషన్ డైరెక్టర్ ధరూర్ జేమ్స్, రాష్ట్ర సంక్షేమ సంఘం వర్కింగ్ ప్రెసిడెంట్ చింతమాను సురేంద్రనాయుడు, జిల్లా బీసీ యూత్ అధ్యక్షుడు కిరణ్, దేవేంద్రగౌడ్, వీరేష్, డీవీ చంద్ర తదితరులు పాల్గొన్నారు.

కూటమి ప్రభుత్వంలో బాదుడే.. బాదుడు

• ఎన్నికల్లో ప్రజలకు ఇచ్చిన హామీలు నెరవేర్చాలి
• 27న విద్యుత్ అధికారులకు వినతి
• మాజీ ఎమ్మెల్యే, వైసీపీ నంద్యాల జిల్లా అధ్యక్షుడు కాటసాని రాంభూపాల్‌రెడ్డి



మాట్లాడుతున్న కాటసాని రాంభూపాల్‌రెడ్డి

కల్లూరు, డిసెంబరు 24(ఆంధ్రజ్యోతి): ఎన్నికల ముందు విద్యుత్ చార్జీలు పెంచమని వాగ్దానం చేసిన కూటమి అధికారం లోకి రాగానే ప్రజలపై బాదుడే..బాదుడు మొదలు పెట్టారని పాణ్యం మాజీ ఎమ్మెల్యే, నంద్యాల జిల్లా వైసీపీ అధ్యక్షుడు కాట సాని రాంభూపాల్‌రెడ్డి అన్నారు. మంగళవారం తన స్వగృహంలో అధిష్టానం ఆదేశాల మేరకు సమావేశం నిర్వహించి ఈనెల 27న జిల్లా, నియోజకవర్గంలో ఇన్‌చార్జులు విద్యుత్ చార్జీలు పెంపును నిరసిస్తూ కరెంట్ ఆఫీసుకు ర్యాలీగా వెళ్లి అధికారులకు వినతిపత్రాలు ఇవ్వాలని పిలుపునిచ్చారు. ఓట్లు వేయించుకుని ప్రజలను మోసం చేయడంలో చంద్రబాబు దిట్ట అని ఎన్నికల్లో ఇచ్చిన హామీలను అమలు చేయాలని డిమాండ్ చేశారు. అధికారం చేపట్టిన ఆరు నెలల్లో రెండు సార్లు ట్రూఅప్, విద్యుత్ చార్జీల పేరిట వేల కోట్ల భారాన్ని వేశారని ఆరోపించారు. పాణ్యం నియోజకవర్గం పరిధిలో ఈనెల 27న కర్నూలు విద్యుత్ కార్యాలయానికి ర్యాలీగా చేరుకుని ఎస్ఈకి వినతిపత్రం ఇవ్వనున్నట్లు తెలిపారు. ప్రజలు పెద్దఎత్తున హాజరై కార్యక్రమం విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

సరిహద్దులను గుర్తించండి: జేసీ

ఓర్వకల్లు, డిసెంబరు 24(ఆంధ్రజ్యోతి): బ్రాహ్మణపల్లె, కాల్వ సరిహద్దులోని ఫారెస్టు భూములను త్వరితగతిన గుర్తించాలని జేసీ డా.బి. నవ్య అధికారులను ఆదేశించారు. మంగళవారం మండలంలోని సోలార్ పార్కు సమీపాన ఉన్న బ్రాహ్మణపల్లె, కాల్వ సరిహద్దులోని ఫారెస్టు భూములను జేసీతో పాటు ట్రైనీ కలెక్టర్ చల్లా కళ్యాణి, ఆర్డీవో సందీప్ కుమార్, తహసీల్దార్ విద్యాసాగర్, డీఎఫ్‌వో శ్యామల, సర్వేయర్ శంకర్ మాణిక్యం, ఫారెస్టు అధికా రులు, సర్వేయర్లు పరిసర ప్రాంతాలను పరిశీలించారు. కొంత కాలంగా సోలార్ పార్కు భూముల విషయంలో నడుస్తున్న వివాదంపై డిప్యూటీ సీఎం నిగ్గు తేల్చాలని ఆదేశించారు. దీంతో అధికారులు సోలార్ పార్కు అధికారులు ఆ పరిసర ప్రాంతాలను పరిశీలించారు.



అధికారులతో మాట్లాడుతున్న జాయింట్ కలెక్టర్ నవ్య

అమిత్‌షాను మంత్రి పదవి నుంచి తొలగించాలి



కలెక్టర్‌కు వినతిపత్రం ఇస్తున్న కాంగ్రెస్ నాయకులు

కర్నూలు కలెక్టరేట్, డిసెంబరు 24(ఆంధ్రజ్యోతి): అమిత్‌షాను కేంద్ర హోం మంత్రి పదవి నుంచి తొలగించాలని కర్నూలు జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు పరిగెల మురళీకృష్ణ డిమాండ్ చేశారు. అఖిల భారత కాంగ్రెస్ కమిటీ పిలుపు మేరకు మంగళవారం కలెక్టర్ కార్యాలయంలోని కలెక్టర్ పి.రంజిత్ బాషాకు వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా మురళీకృష్ణ మాట్లాడుతూ రాజ్యసభలో కేంద్ర మంత్రి అమిత్‌షా భారత రాజ్యాంగ నిర్మాత బీఆర్ అంబేడ్కర్‌పై అనుచిత వ్యాఖ్యలు చేశారన్నారు. కార్యక్రమంలో ఎన్‌సీ బజారన్న, అనంతరత్నం మాదిగ, షేక్ మబాలిక్, సయ్యద్ నవీద్, డీవీ సాంబ శివుడు, ఎస్.ప్రమీల పాల్గొన్నారు.

ఘనంగా వినియోగదారుల హక్కుల దినోత్సవం



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న జేసీ నవ్య, క్లస్టర్ వర్సిటీ వీసీ తదితరులు

కర్నూలు కల్చరల్, డిసెంబరు 24(ఆంధ్రజ్యోతి): జాతీయ వినియోగదారుల హక్కుల దినోత్సవాన్ని మంగళవారం ఘనంగా నిర్వహించారు. జిల్లా పౌర సరఫరాల శాఖ ఆధ్వర్యంలో నగరంలోని బి.క్యాంపులోగల సిల్వర్ జూబ్లీ కళాశాలలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా నైస్ స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో వ్యాసరచన పోటీలు నిర్వహించి బహుమతులు అందజేశారు. జేసీ బి.నవ్య, క్లస్టర్ వర్సిటీ వీసీ ఆచార్య డీవీఆర్ సాయిగోపాల్, జిల్లా పౌర సరఫరాల శాఖ అధికారి రఘువీర్, ఆర్డీవో సందీప్‌కుమార్, జిల్లా వినియోగదారుల కమిషన్ సభ్యుడు నారాయణరెడ్డి, సిల్వర్‌జూబ్లీ కళాశాల ప్రిన్సిపాల్ వీవీ సుబ్రహ్మణ్య కుమార్, మున్సిపల్ హెల్త్ అధికారి విశ్వేశ్వరరెడ్డి, నైస్ యూత్ ఫర్ కల్చర్ అండ్ ఎడ్యుకేషన్ సొసైటీ అధ్యక్షుడు డాక్టర్ రాయపాటి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబాలకు దుస్తుల పంపిణీ

కర్నూలు కల్చరల్, డిసెంబరు 24(ఆంధ్రజ్యోతి): నగరంలోని కోల్స్ సెంటీనియల్ తెలుగు బాప్టిస్టు చర్చి క్రిస్మస్, న్యూ ఇయర్ కమిటీ వారి ఆధ్వర్యంలో క్రిస్మస్‌ను పురస్కరించుకొని లెప్రసీ బాధిత కుటుంబాలకు దుస్తులు అందజేశారు. మంగళవారం నగరంలోని వీకర్‌సెక్షన్ కాలనీలో గల ఈ కుటుంబాలకు కోల్స్ చర్చి మాజీ యూత్ డైరెక్టర్ పి.విజయ్ కుమార్ ఆధ్వర్యంలో దుస్తులు అందజేశారు. ముఖ్య అతిథులుగా పాస్టర్ రెవ.జీవన్‌రావు, క్రిస్మస్, న్యూ ఇయర్ కమిటీ చైర్మన్ ముత్యాల భాస్కర రావు, రూపస్ రొనాల్డ్, కార్యదర్శులు ప్రసన్నదత్, డేవిడ్ సునీల్, కోల్స్ చర్చి కమిటీ సభ్యుడు జయకుమార్ హాజరై ప్రసంగించారు. కార్యక్రమంలో రాచపూడి ప్రభాకర్, విన్సెంట్ గాంధీ, దినకర్, ప్రసాద్, జాన్‌మార్క్, లెప్రసీ కాలనీ చర్చి పాస్టర్లు పాల్గొన్నారు.

పోరాటాలకు సిద్ధం కండి: ఏఐవైఎఫ్

ఓర్వకల్లు, డిసెంబరు 24(ఆంధ్రజ్యోతి): విద్య, వైద్యం ఉపాధి హక్కుల కోసం సమరశీల పోరాటాలకు సిద్ధం కావాలని మాజీ ఏఐవైఎఫ్ నగర కార్యదర్శి రమేష్ పిలుపునిచ్చారు. మంగళవారం ప్రజా సంఘాల కార్యాలయ భవనంలో ఏఐవైఎఫ్ సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి మాజీ నాయకుడు సుధాకర్ అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా రమేష్ మాట్లాడుతూ ఓర్వకల్లు పరిశ్రమల హబ్‌గా పేరుకే గాని, ఉపాధి అవకాశాలు కల్పించలేదన్నారు. కార్యక్రమంలో శివ, ముని స్వామి, హరి పాల్గొన్నారు.

● **నూతన కమిటీ ఎన్నిక:** ఏఐవైఎఫ్ ఓర్వకల్లు మండల నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు మాజీ ఏఐవైఎఫ్ సహాయ కార్యదర్శి రమేష్ తెలిపారు. మండల అధ్యక్షుడిగా జి.బాబు, ఉపాధ్యక్షులుగా సూరి, రమేష్, అయ్యస్వామి, సాయికుమార్, మండల కార్యదర్శిగా లక్ష్మణ్‌రావు, సహాయ కార్యదర్శులుగా రమేష్, ఇదుర్‌బాషా, వలి, జగదీష్‌లతోపాటు మరికొంత మంది సభ్యులను ఎన్నుకున్నారు.

రేపు సంపూర్ణ భగవద్గీత పారాయణ యజ్ఞం

కర్నూలు కల్చరల్, డిసెంబరు 24(ఆంధ్రజ్యోతి): నగరంలోని స్వామి విద్యా ప్రకాశానంద గీతా ప్రచార సంఘం ఆధ్వర్యంలో, ఏకాదశి పర్వదినాన్ని పురస్కరించుకొని గురువారం ఉదయం సంపూర్ణ భగవద్గీత పారాయణ యజ్ఞం నిర్వహిస్తున్నట్లు గీతా ప్రచార సంఘం సేవక్ ఎస్‌జీ మహబలేష్ తెలిపారు. గీతా ప్రచార సంఘం అధ్యక్షుడు డీవీ రమణ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమంలో భక్తులకు భగవద్గీత పుస్తకాలు అందజేస్తారని మహబలేష్ తెలిపారు.

క్రిస్మస్‌కు ముస్తాబైన చర్చిలు

కర్నూలు కల్చరల్, డిసెంబరు 24 (ఆంధ్రజ్యోతి): నగరంలో బుధవారం జరిగే క్రిస్మస్ వేడుకలకు చర్చిలు ముస్తాబయ్యాయి. కోట్ల సర్కిల్ సమీపంలోని కోల్స్ సెంటీనియల్ తెలుగు బాప్టిస్టు చర్చి, పెద్దపార్కు వద్ద గల సీఎస్ఐ చర్చి, శ్రీనివాస నగర్‌లోని స్టాంటన్ చర్చి, ఐదు రోడ్ల కూడలి లోని రాక్‌వుడ్ చర్చి, సి.క్యాంపులోని ప్రార్థన మందిరం, నంద్యాల చెక్‌పోస్టు సమీపంలోని బిషప్ చర్చి, హోసన్న మందిరం, నందికొట్కూరు రోడ్డులోని కల్వరి టెంపుల్, చిన్న పార్కు సమీపంలోని థెరీసమ్మ చర్చి, స్టాంటన్ పురంలోని ఏబీఎం చర్చిల్లో క్రిస్మస్ వేడుకలు ఘనంగా నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగా మంగళవారం అర్ధరాత్రి నుంచి వివిధ చర్చిలలో క్రీస్తు జనన వేడుక సందర్భంగా ప్రత్యేక ప్రార్థనలు ఆరంభించారు. ఆయా చర్చిల లోపల క్రిస్మస్ స్టార్లు, క్రిస్మస్ ట్రీలు, క్రిస్మస్ బెల్స్‌తో పాటు రంగుల బెలూన్లు, కాగితాల తోరణాలతో శోభాయమానంగా ముస్తాబు చేశారు. మంగళవారం రాత్రి జరిగిన ప్రార్థనల్లో కొన్ని చర్చిలలో శాంతాక్లాజ్‌ల వేషధారణలో పిల్లలకు చాక్లెట్లు, బిస్కెట్లు పంపిణీ చేశారు.




విద్యుద్దీపాలంకరణలో నంద్యాల చెక్ పోస్టు సమీపంలోని బిషప్ చర్చి, పెద్దపార్కు సమీపంలోని సీఎస్ఐ చర్చి




సి.క్యాంపులోని ప్రార్థనమందిరం, అర్ధరాత్రి12 గంటలకు బిషప్ చర్చిలో ప్రత్యేక ప్రార్థనలు



కోల్స్ చర్చిలో పశువుల పాక సెట్టింగ్

జానపద కళలను ఆదరించాలి

కర్నూలు కల్చరల్, డిసెంబరు 24(ఆంధ్రజ్యోతి): అంతరించిపోతున్న జానపద కళలను ప్రజలు ఆదరించాలని గుండె వైద్య నిపుణుడు, హార్ట్ ఫౌండేషన్ వ్యవస్థాపకుడు డాక్టర్ పి.చంద్రశేఖర్ అన్నారు. మంగళవారం రాత్రి ఏపీ భాషా సాంస్కృతిక శాఖ సౌజన్యంతో, నగరంలోని సూర్యకళా కల్చరల్ అకాడమీ ఆధ్వర్యంలో రెండు రోజుల జానపద సంగీత నృత్యోత్సవాలు ఘనంగా ఆరంభమయ్యాయి. ముఖ్య అతిథిగా విచ్చేసిన డాక్టర్ పి.చంద్రశేఖర్ మాట్లాడుతూ జిల్లాలోని మారుమూల గ్రామాల్లో నేటికీ జానపద పాటలు, ఆటలు ఆదరణ పొందుతున్నాయన్నారు. మరో అతిథి, తెలుగు భాషా వికాస ఉద్యమం రాష్ట్ర కార్యదర్శి జేఎస్ఆర్‌కే శర్మ మాట్లాడుతూ రెండు రోజుల పాటూ జానపద కళలను బతికించుకోవాలని, అప్పుడే భవిష్యత్తు తరాల వారికి వాటిని అందించినట్లు అవుతుందన్నారు. సూర్యకళా కల్చరల్ అకాడమీ అధ్యక్షుడు బైలుపాటి సోమశంకరయ్య మాట్లాడుతూ రెండు రోజులపాటు కొనసాగే జానపద సంగీత నృత్యోత్సవాలను ప్రేక్షకులు ఆదరించాలని విజ్ఞప్తి చేశారు. నృత్యోత్సవాల్లో భాగంగా చిన్నారి కళాకారులు ప్రదర్శించిన జానపద నృత్యం, డప్పు, డోలు కళాకారుల నృత్య, శబ్ద విన్యాసాలు, మహిళల కోలాటాలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో సూర్యకళా కల్చరల్ అకాడమీ కార్యదర్శి కె. పద్మావతి, హార్ట్ ఫౌండేషన్ కోశాధికారి కేసీ రాముడు పాల్గొన్నారు.



జానపద సంగీత నృత్యోత్సవాలను ప్రారంభిస్తున్న డాక్టర్ చంద్రశేఖర్

క్రిస్మస్ శుభాకాంక్షలు

కర్నూలు అర్బన్, డిసెంబరు 24(ఆంధ్రజ్యోతి): జిల్లాలోని క్రైస్తవులకు ఎంపీ బస్తిపాటి నాగరాజు క్రిస్మస్ శుభాకాంక్షలు తెలిపారు. క్రిస్మస్‌ను ఆనందంగా జరుపుకోవాలని ఆయన ఆకాంక్షించారు. క్రిస్మస్ ప్రేమ, కరుణకు ప్రతీక అన్నారు. క్రీస్తు చూపిన మార్గంలో పయనించేలా ప్రతి ఒక్కరూ కృషి చేయాలని కోరారు.

● జిల్లాలోని క్రైస్తవులకు టీడీపీ జిల్లా అధ్యక్షుడు తిక్కారెడ్డి క్రిస్మస్ శుభాకాంక్షలు తెలిపారు. మంగళవారం జిల్లా తెలుగుదేశం పార్టీ కార్యాల యంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రపంచానికి శాంతి సందేశాన్ని అందజేసినటువంటి దీన జనోద్ధారకులు ప్రవక్త ఏసు క్రీస్తు తన ప్రబోధనల ద్వారా సమాజానికి మంచిని ప్రబోధించి, సన్మార్గం లో నడిచేందుకు మార్గదర్శకులుగా మారారని అన్నారు.

● క్రీస్తు జననం అపూర్వమైందని, జిల్లా ప్రజలకు డీసీసీ అధ్యక్షుడు పి.మురళీకృష్ణ క్రిస్మస్ శుభాకాంక్షలు తెలిపారు. మంగళవారం జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో జిల్లా కాంగ్రెస్ కమిటీ ఆధ్వర్యంలో సెమీ క్రిస్మస్ వేడుకలు ఘనంగా జరిగాయి. కార్యక్రమంలో పాస్టర్ రెవరెండ్ జీవన్, మాజీ ఎమ్మెల్సీ సుధాకర్ బాబు, వీజీ రామ్‌పుల్లయ్య యాదవ్, షేక్ జిలాని బాషా, అనంతరత్నం మాదిగ, మల్లేశ్వరి, ఎస్ ప్రమీల పాల్గొన్నారు.

కర్నూలు న్యూసిటీ: క్రిస్మస్ సందర్భంగా నగర ప్రజలకు నగర మేయర్ బీవై.రామయ్య, కమిషనర్ ఎస్.రవీంద్ర బాబు మంగళవారం ఒక ప్రకటనలో క్రిస్మస్ శుభాకాంక్షలు తెలిపారు. శాంతి, సమనం, ప్రేమను సమాజానికి పంచడమే క్రిస్మస్ పండుగని, విశ్వమానవాళికి ప్రేమతత్వంతో వెలుగులు పంచిన కరుణామయుడు ఏసుక్రీస్తు అన్నారు. పండుగను ప్రజలంతా సుఖసంతోషాలతో జరుపుకోవాలని ఆకాంక్షించారు.

ఏసుక్రీస్తు బోధనలు ఆచరణీయం



కేక్ కట్ చేస్తున్న డాక్టర్ శంకర్ శర్మ

కర్నూలు హాస్పిటల్, డిసెంబరు 24(ఆంధ్రజ్యోతి): ఏసుక్రీస్తు బోధనలు అందరికీ ఆచరణీయమని అనుసరణీయమని సీనియర్ గ్యాస్ట్రో ఎంట్రాలజీస్టు డాక్టర్ బి.శంకర్‌శర్మ అన్నారు. నగరంలోని శ్రీనివాసనగర్‌లో ఉన్న స్టాంటన్ బాప్టిస్టు చర్చిలో జరిగిన క్రిస్మస్ వేడుకలకు ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని చర్చి ఫాదర్ దేవసహాయం, మేరీతో కలిసి కేక్ కట్ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏసు ప్రభువు ప్రజల పాపాలను తొలగించేందుకు ఈ భూమిపైకి వచ్చారని వివరించారు.

గ్రామీణ అభివృద్ధే ప్రభుత్వ లక్ష్యం: ఎంపీ



పంచలింగాలలో పర్యటిస్తున్న ఎంపీ నాగరాజు

కర్నూలు రూరల్, డిసెంబరు 24(ఆంధ్రజ్యోతి): గ్రామీణ ప్రాంత అభివృద్ధే కూటమి ప్రభుత్వ లక్ష్యమని కర్నూలు పార్లమెంట్ సభ్యుడు బస్తిపాటి నాగరాజు అన్నారు. కర్నూలు రూరల్ మండలంలోని ఆయన సొంత గ్రామమైన పంచలింగాలలో మంగళవారం ఆయన పర్యటించారు. ప్రజలు పలు సమస్యలను ఎంపీ దృష్టికి తీసుకొచ్చారు. ఈసందర్భంగా ఎంపీ నాగరాజు మాట్లాడుతూ గత వైసీపీ ప్రభుత్వం పంచాయతీ నిధులను దారి మళ్లించడంతో గ్రామాలు అభివృద్ధికి నోచుకోలేదని ఆరోపించారు. రాష్ట్రం, కేంద్రంల్లో ఎన్డీయే కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో రాష్ట్ర వ్యాప్తంగా గ్రామీణ ప్రాంతాల అభివృద్ధికి సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్‌కళ్యాణ్ ప్రత్యేక నిధులను కేటాయిస్తున్నారన్నారు.

భూసమస్యల పరిష్కారానికే రెవెన్యూ సదస్సులు



మాట్లాడుతున్న డీటీ షర్మిళా రెడ్డి

ఓర్వకల్లు, డిసెంబరు 24(ఆంధ్రజ్యోతి): భూసమస్యల పరిష్కారానికే ప్రభుత్వం రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తుందని టీడీపీ సీనియర్ నాయకుడు చదువుల సుధాకర్ రెడ్డి అన్నారు. మండలంలోని పాలకొలను గ్రామంలో మంగళవారం రెవెన్యూ సదస్సు నిర్వహించారు. ఈ సదస్సుకు సర్పంచ్ చదువుల సుజాతమ్మ అధ్యక్షత వహించారు. రీసర్వే డీటీ షర్మిళా రెడ్డి మాట్లాడుతూ ప్రజలు, రైతుల నుంచి స్వీకరించిన ప్రతి అర్జీని పరిష్కరిస్తామన్నారు. గ్రామంలో ఆరుగురు రైతులు గత కొన్నేళ్లుగా ప్రభుత్వ స్థలంలో రూ.లక్షలు ఖర్చు పెట్టి బోర్లు వేసి మామిడి, చీని, పొగాకు పంటలు వేశారని, అధికారులు స్పందించి ఆ రైతులకు పట్టాలు ఇవ్వాలని కోరారు. అనంతరం రైతుల నుంచి దరఖాస్తులు స్వీకరించారు. కార్యక్రమంలో ఈవో మద్దిలేటి, రైతులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

విద్యార్థులు ఇష్టంతో చదవండి

ఓర్వకల్లు, డిసెంబరు 24 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు ఇష్టంతో చదివితే ఉన్నత శిఖరాలకు వెళ్తారని మాజీ ఎమ్మెల్సీ, రిటైర్డు ఐజీ మహ్మద్ ఇక్బాల్, గుట్టపాడు సర్పంచ్ మోహన్ రెడ్డి అన్నారు. మంగళవారం ఓర్వకల్లులోని జడ్పీ ఉన్నత పాఠశాలను గుట్టపాడు సర్పంచ్ మోహన్ రెడ్డి, మాజీ కార్పొరేటర్ సురేంద్రరెడ్డి పాఠశాలను సందర్శించారు. విద్యార్థులు క్రీడలకు కావాల్సిన స్పోర్ట్స్ కిట్లను మాజీ ఎమ్మెల్సీ మహ్మద్ ఇక్బాల్, సర్పంచ్ మోహన్ రెడ్డి అందజేశారు. విద్యార్థులకు తాగునీరు ఇబ్బందిగా ఉండటం తో వాటర్ ట్యాంకును ఏర్పాటు చేసి రూ.20వేల నగదును అందజేశారు. పాఠశాల పూర్వ విద్యార్థి నర్ల మోహన్ రెడ్డి విద్యార్థులకు తాగునీటి కొరకు అదనపు ట్యాంకు, పాఠశాల హెచ్‌ఎంకు రూ.10వేల నగదును అందజేశారు. కార్యక్రమంలో హెచ్‌ఎం రామచంద్రారెడ్డి, ఉపాధ్యాయులు వరలక్ష్మి, భాస్కర్, రామాంజనేయులు, చంద్రశేఖర్, రాజు, హరి, ప్రసాద్, విద్యార్థులు పాల్గొన్నారు.

నోటి శుభ్రంతో ఆరోగ్యం

కర్నూలు హాస్పిటల్, డిసెంబరు 24 (ఆంధ్రజ్యోతి): ఆరోగ్యం కోసం నోటిని శుభ్రంగా ఉంచుకోవాలని ఇండియన్ డెంటల్ అసోసియేషన్ ఏపీ స్టేట్ రెప్రజెంటేటివ్ డా.లక్కిరెడ్డి అమరసింహారెడ్డి అన్నారు. జాతీయ దంత వైద్యుల దినోత్సవం సందర్భంగా నగరంలో ఎ.క్యాంపు ఇందిరా గాంధీ స్మారక మెమోరియల్ హైస్కూల్‌లో ఆయన ఉచిత దంత వైద్యశిబిరాన్ని నిర్వహించారు. దంతాలు ఆరోగ్యంగా లేకుంటే మరిన్ని శారీరక అనారోగ్యాలకు కారణమవుతాయని హెచ్చరించారు. దంతాలను రెండుసార్లు బ్రష్ చేసుకోవాలని సూచించారు. అనంతరం ఆయన విద్యార్థులకు బ్రష్‌లు, పేస్టులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్‌ఎం, ఉపాధ్యా యులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఉపాధి పనుల పరిశీలన

సి.బెళగల్, డిసెంబరు 24(ఆంధ్రజ్యోతి): మండలంలోని పోలకల్లు, ఇనగండ్ల గ్రామాల్లో ఉపాధి పనులను ఎంపీడీవో రాణెమ్మ మంగళవారం పరిశీలించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ జాబుకార్డు ఉన్నవారు మాత్రమే ఉపాధి పనులకు హాజరుకావాలన్నారు. ఎంపీడీవో వెంట ఏపీవో రామన్న, ఈసీ రంగస్వామి, టెక్నికల్, ఫీల్డ్ అసిస్టెంట్లు ఉన్నారు.

ఆలయ అభివృద్ధికి కృషి చేస్తా

టీటీడీ సూపరింటెండెంట్ ఢిల్లీ రెడ్డి

ఓర్వకల్లు, డిసెంబరు 24 (ఆంధ్రజ్యోతి): కాల్వబుగ్గ రామేశ్వర స్వామి ఆలయాన్ని టీటీడీ ఆధ్వర్యంలో అభివృద్ధి చేస్తామని టీటీడీ సూపరింటెం డెంట్ ఢిల్లీ రెడ్డి అన్నారు. మంగళవారం ఆయన కాల్వబుగ్గ క్షేత్రాన్ని సందర్శించారు. ఇటీవల టీటీడీ పాలకమండలి బోర్డు సమావేశంలో టీటీడీ చైర్మన్ బీఆర్ నాయుడు, ఈవో శ్యామలరావుకు రూ.12 కోట్లతో చేపట్టే అభివృద్ధి పనులకు సంబంధించిన ప్రణాళికలను టీటీడీ బోర్డు సభ్యుడు మల్లెల రాజశేఖర్ ఇచ్చారు. టీటీడీ ఆదేశాల మేరకు ఆయన కాల్వబుగ్గను సందర్శించారు. కాల్వబుగ్గలో రూ.12 కోట్లతో వివిధ పనులు స్టోన్ ఫ్లోరింగ్, పశ్చిమాన 5 అంతస్థుల రాజగోపురం పునఃనిర్మాణం, మూడంతస్థుల రాజగోపురాల నిర్మాణం, ఆలయ ప్రదేశం చుట్టూ ప్రహరీ నిర్మాణం వంటి వివిధ పనులను చేపట్టేందుకు నివేదికలు ఇచ్చారు. ఈ ప్రతిపాదనలను టీటీడీ బోర్డుకు అందజేస్తున్నట్లు సూపరింటెండెంట్ ఢిల్లీ రెడ్డి తెలిపారు. అనంతరం ఆయనకు ఆలయ ఈవో మద్దిలేటి శ్రీవారి చిత్రపటాలు అందజేశారు. కార్యక్రమంలో నాయకులు కేవీ మధు, కాటి నేని నారాయణ, నాగరాజు, వడ్డె నారాయణ, వడ్డె రాముడు, కాకి దేవేం ద్ర, గువ్వ రవికుమార్, శేకరప్ప, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.



ఢిల్లీ రెడ్డికి స్వామివారి చిత్రపటాన్ని అందజేస్తున్న ఈవో

నిబంధనలను అతిక్రమిస్తే చర్యలు

కర్నూలు న్యూసిటీ, డిసెంబరు 24(ఆంధ్రజ్యోతి): నగర పాలక సంస్థకు చెందిన ఆస్తులను వివిధ రూపాల్లో లీజుకు దక్కించుకున్న నిర్వాహకులు నిబంధనలను అతిక్రమిస్తే చర్యలు తప్పవని అడిషనల్ కమిషనర్ ఆర్‌జీవీ కృష్ణ హెచ్చరించారు. మంగళవారం గుత్తిపెట్రోలు బంకు సమీపంలోని పార్కింగ్ స్థలం, బిర్లాకాంపౌండులోని వెండర్ జోన్‌తో పాటు వీఎల్‌టీ, ఇంటి పన్నులకు సంబంధించి పలు దరఖాస్తు స్థలాలను అధికారులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బిర్లా కాంపౌండులోని వెండర్‌జోన్ పనులు పూర్తి కావచ్చాయని, త్వరలో కేటాయింపు ప్రక్రియ చేపడతామన్నారు. రెవెన్యూ ఆఫీసర్ జునీద్, ఆర్ఐలు తిప్పన్న, భార్గవ్, ప్రత్యేక అధికారి రాజు ఉన్నారు.

విద్యుత్ సరఫరాలో మార్పులు

ఓర్వకల్లు, డిసెంబరు 24(ఆంధ్రజ్యోతి): విద్యుత్ సరఫరాలో మార్పులు చేస్తున్నట్లు ఓర్వకల్లు విద్యుత్ అసిస్టెంట్ ఇంజనీర్ సునీల్ బాబు మంగళవారం తెలిపారు. సోమయాజులపల్లె నుంచి గని, ఏపీ ట్రాన్స్‌కో, సబ్ స్టేషన్‌లోకి వచ్చే 220 కేవీ లైన్ కండక్టర్ మార్పు పనులు జరుగుతున్న ందున ఓర్వకల్లు సబ్ స్టేషన్ పరిధిలోని 11 కేవీ కాల్వబుగ్గ, అగ్రికల్చర్, త్రీఫేస్ సప్లయ్, వ్యవసాయ బావులు, పంచాయతీ సరఫరా వేళల్లో స్వల్ప మార్పులు చేస్తున్నామన్నారు. తిప్పాయపల్లె, శకునాల, బ్రాహ్మనపల్లె, గుమితం తండా గ్రామాల్లో ఉదయం 5 నుంచి 10 గంటల వరకు అలాగే సాయంత్రం 4 గంటల నుంచి 8 గంటల వరకు వ్యవసాయానికి సప్లయ్ ఇస్తామన్నారు. ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు ఎటువంటి విద్యుత్ సరఫరా ఉండదన్నారు.

రోడ్డు సైడ్ దుకాణాల తొలగింపు ఆపాలి

కర్నూలు న్యూసిటీ, డిసెంబరు 24(ఆంధ్రజ్యోతి): నగరంలో రోడ్డు సైడ్ దుకాణాల తొలగింపు ఆపాలని చిరు వ్యాపారుల సంఘం నగర కార్యదర్శి ఎం.మహ్మద్ రఫి అన్నారు. మంగళవారం గుత్తిపెట్రోలు బంకు సమీపంలోకి తనిఖీకి వచ్చిన అడిషనల్ కమిషనర్ ఆర్‌జీవీ కృష్ణను కలిసి సమస్యలను విన్నవించారు. ఈ సందర్భంగా రఫి మాట్లాడుతూ బిర్లా కాంపౌండు వద్ద ఫ్లైఓవర్ బ్రిడ్జి కింద దుకాణం దక్కించుకుని ఓ కాంట్రాక్టర్ ప్రతి రోజు రూ.250 కడితేనే వ్యాపారం చేసుకోవాలేని భయభ్రాంతులకు గురిచేస్తున్నారని అన్నారు. కార్యక్రమంలో 29వ వార్డు కార్పొరేటర్ సుదర్శన్‌రెడ్డి, సంఘం ఉపాధ్యక్షులు లక్ష్మయ్య, అక్బర్, చిట్టెమ్మ పాల్గొన్నారు.

27న విద్యుత్ కార్యాలయం ముట్టడి : వైసీపీ

కోడుమూరు, డిసెంబరు 24(ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వం కరెంటు చార్జీలు పెంచడాన్ని నిరసిస్తూ ఈనెల 27 వైసీపీ ఆధ్వర్యంలో విద్యుత్ కార్యాలయాన్ని ముట్టడిస్తున్నామని జడ్పీటీసీ రఘునాథ్‌రెడ్డి తెలిపారు. స్థానిక వైసీపీ కార్యాలయంలో మంగళవారం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఎన్నికల ముందు కూటమి ప్రభుత్వం అధికారంలోకి వస్తే కరెంటు చార్జీలు పెంచమని హామీ ఇచ్చిందన్నారు. అధికారంలోకి వచ్చిన 6నెలల్లోనే కరెంటు చార్జీలను పెంచి ప్రజలను మోసం చేసిన ఘనత కూటమి ప్రభుత్వానిదే అన్నారు. విద్యుత్ చార్జీల పెంపును నిరసిస్తూ 27న స్థానిక పాతబస్టాండ్ నుంచి విద్యుత్ కార్యాలయం వరకు ర్యాలీ నిర్వహించి, అనంతరం ధర్నా చేపడుతున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో వైసీపీ నాయకులు ఆదిమూలపు సతీష్, క్రిష్ణారెడ్డి, లాయర్ ప్రభాకర్, రమేష్ నాయుడు, రవికుమార్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

హ్యాండ్‌బాల్ పోటీలకు జిల్లా క్రీడాకారులు

కర్నూలు స్పోర్ట్స్, డిసెంబరు 24 (ఆంధ్రజ్యోతి): జాతీయ స్థాయి హ్యాండ్‌బాల్ పోటీలకు ఉమ్మడి జిల్లాకు చెందిన క్రీడాకారులు ఎంపికైనట్లు హ్యాండ్‌బాల్‌సంఘం రాష్ట్ర కార్యదర్శి సత్యనారాయణ రాజు, జిల్లా కార్యదర్శి రుద్రారెడ్డి మంగళవారం తెలిపారు. జగదీష్ (బనగానపల్లె), షేక్షావలి (కర్నూలు), శివ (కర్నూలు)ను ఎంపిక చేశారన్నారు. వీరితో పాటు శిక్షకుడుగా ప్రభాకర్ (కర్నూలు)ను తీసుకున్నారు. ఈ నెల 26 నుంచి 29 వరకు కేరళ రాష్ట్రం కొట్టాయంలో జరిగే 53వ జాతీయ స్థాయిసీనియర్ హ్యాండ్‌బాల్ పోటీల్లో పాల్గొంటారన్నారు.

సీపీఐ శత వార్షికోత్సవాలను ఘనంగా నిర్వహించాలి

కర్నూలు న్యూసిటీ, డిసెంబరు 24(ఆంధ్రజ్యోతి): జిల్లా వ్యాప్తంగా సీపీఐ శత వార్షికోత్సవాలను ఘనంగా నిర్వహించాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గసభ్యుడు పి.రామచంద్రయ్య పిలుపునిచ్చారు. మంగళవారం సీఆర్ భవన్‌లో నగర కార్యదర్శి పి.రామక్రిష్ణారెడ్డి అధ్యక్షతన జరిగిన జిల్లా కార్యవర్గసమావేశంలో ఆయన మాట్లాడుతూ దేశ సమైక్య, సమ గ్రత కోసం సమరశీల పోరాటాలు నిర్వహించాలన్నారు. మూడో సారి అధికారంలోకి వచ్చిన బీజేపీ ప్రభుత్వం కార్మికులు, కర్షకులను దోపిడీ చేసే విధంగా చట్టాలు తీసుకువస్తుందని విమర్శించారు. రాష్ట్రంలో పాలించే పాలకులంతా కేంద్రంలోని బీజేపికి అంటకాగుతూ రాష్ట్రానికి అవసరమైన నిధులు తీసుకురావడంలో విఫలమయ్యారని ఆరోపించారు. సమావేశంలో రాష్ట్ర కార్యవర్గసభ్యుడు ఆవుల శేఖర్, జిల్లా కార్యదర్శి బి.గిడ్డయ్య, సహాయ కార్యదర్శి ఎస్.మునెప్ప, జిల్లా కార్యవర్గసభ్యుడు కే.జగన్నాథం పాల్గొన్నారు.

మెడికల్ ఎంప్లాయీస్ వ్యవస్థాపక దినోత్సవం

కర్నూలు హాస్పిటల్, డిసెంబరు 24(ఆంధ్రజ్యోతి): కర్నూలు సర్వజన వైద్యశాలలో ఏపీ మెడికల్ ఎంప్లాయీస్ యూనియన్ 72వ వ్యవస్థాపక దినోత్సవం ఘనంగా జరిగింది. మంగళవారం ఆస్పత్రి యూనియన్ ఆఫీసులో జరిగిన ఈ కార్యక్రమానికి సివిల్ సర్జన్ అడ్మినిస్ట్రేటర్ డాక్టర్ బీ.వెంకటేశ్వరరావు ముఖ్యఅతిథిగా పాల్గొని జెండాను ఆవిష్కరించారు. ఈసందర్భంగా ఏపీ మెడికల్ ఎంప్లాయీస్ యూనియన్ రాష్ట్ర ఉపాధ్య క్షుడు బాలు నాయక్ మాట్లాడుతూ 1952 డిసెంబరు 24న రాష్ట్రంలో యూనియన్ ప్రారంభమైందన్నారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ రాష్ట్ర నాయకుడు ఎస్.మునెప్ప, నగర కార్యదర్శి చంద్రశేఖర్, మెడికల్ ఎం ప్లాయీస్ యూనియన్ సెక్రటరీ ఖాజామొద్దీన్, శాఖ కోశాధికారి కే.సురేష్, నాయకులు ఆదినారాయణ, నరసింహులు, ఉరుకుందయ్య, శశిరెడ్డి, సుశీలమ్మ పాల్గొన్నారు.

తాగునీటి సమస్య పరిష్కారం

సి.బెళగల్, డిసెంబరు 24(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో ఎన్టీఆర్ కాలనీలో తాగునీటి సమస్యను పరిష్కరించినట్లు ఎంపీటీసీ ఈరన్నగౌడు, చరణ్‌గౌడు, వెంకటేశ్‌గౌడు, చంద్ర తెలిపారు. మంగళవారం కాలనీలో ఏర్పాటు చేసిన తాగునీటి పైపులైన్‌ను వారు పరిశీలించారు. ఈసందర్భం గా ఎంపీటీసీ ఈరన్నగౌడు మాట్లాడుతూ గత ఎన్నికల్లో ఎన్టీఆర్ కాలనీ లో తాగునీరు, మురుగు కాలువలు, సీసీ రోడ్ల సమస్యలను పరిష్క రిస్తామని కోడుమూరు ఎమ్మెల్యే బొగ్గుల దస్తగిరి, టీడీపీ సీనియర్ నాయకుడు విష్ణువర్ధన్‌రెడ్డి హామీ ఇచ్చారన్నారు. ఈ మేరకు ఎన్టీఆర్ కాలనీలో తాగునీటి పైపులైన్లు వేశామన్నారు.

రగ్బీ పోటీలకు జిల్లా క్రీడాకారులు

కర్నూలు స్పోర్ట్స్, డిసెంబరు 24 (ఆంధ్రజ్యోతి): రగ్బీ 68వ జాతీయ స్థాయి అండర్-19 పోటీలకు కర్నూలు జిల్లా నుంచి ముగ్గురు బాలికలు, ముగ్గురు బాలురు ఎంపికయ్యారు. డీవీఈవో పరమేశ్వర రెడ్డి వారిని మంగళవారం అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లా నుంచి 20 నుంచి 30 మంది క్రీడాకారులు జాతీయ స్థాయి పోటీలకు ఎంపిక కావడం గర్వకారణంగా ఉందన్నారు. అండర్-19 కార్యదర్శి హర్షవర్ధన్, ఆర్ఐవో గురువయ్యశెట్టిలు క్రీడాకారులను అభినందించారు. హర్షవర్ధన్ మాట్లాడుతూ బీహార్ రాష్ట్రంలో పాట్నాలో ఈ నెల 24, 25, 26 తేదీల్లో జాతీయ స్థాయి అండర్-19 బాలబాలికల చాంపియన్‌షిప్‌లో పాల్గొంటారని తెలిపారు.

పేదలకు దుస్తుల పంపిణీ

కోడుమూరు రూరల్, డిసెంబరు 24 (ఆంధ్రజ్యోతి): మండలంలోని అనుగొండలో క్రిస్మస్ పండుగను పురస్కరించుకుని టీడీపీ నాయకుడు ఎల్. రామక్రిష్ణారెడ్డి మంగళవారం రాత్రి పేదలకు దుస్తులు పంపిణీ చేశారు. ముందుగా దివంగత రాజవర్ధన్‌రెడ్డి ఫ్లెక్సీకి క్షీరాభిషేకం చేశారు. అనంతరం కేక్ కట్ చేసి క్రిస్మస్ శుభాకాంక్షలు తెలియజేశారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు రామచంద్రారెడ్డి, మధుసూధన్‌రెడ్డి, గిడ్డయ్య, నాగమద్దయ్య, పరమేశ్, హనుమంతు, మౌలాలి, నాగేంద్ర, సుధాకర్, కక్కన్న పాల్గొన్నారు.

జిల్లా స్థాయి కబడ్డీ పోటీలు

దేవనకొండ,డిసెంబరు 24 (ఆంధ్రజ్యోతి): నేటి నుంచి రెండు రోజుల పాటు తెర్నేకల్‌లో క్రిస్మస్ సందర్భంగా జిల్లాస్థాయి కబడ్డీ పోటీలను నిర్వహించనున్నట్లు గ్రామస్తులు తెలిపారు. మొదటి బహుమతిగా రూ.30 వేలు కొత్తకాపు మధుసూదన్‌రెడ్డి, ద్వితీయ బహుమతిగా రూ.20వేలు సర్పంచ్ యం.అరుణ్‌కుమార్, తృతీయ బహుమతిగా రూ.10వేల ను లూముంబా ఇవ్వనున్నట్లు ఏబీయం సంఘ పెద్దలు తెలిపారు.

నీట మునిగిన పశుగ్రాసం



హంద్రీ నీటిలో మునిగిన పశుగ్రాసం

మద్దికెర, డిసెంబరు 24 (ఆంధ్రజ్యోతి): గ్రామంలోని మద్దమ్మ కుంట సమీపాన నిల్వ చేసిన పశువుల మేత హంద్రీనీవా కాల్వ నీటితో మునిగిందని రైతులు గోపాల్, రామాంజులు, పాపన్న, లక్ష్మీనారాయణ మంగళవారం ఆవేదన వ్యక్తం చేశారు. విషయాన్ని పంచాయతీ ఎంపీడీవో అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. హంద్రీనీవా నీరు వదలడంతో కళ్లాలకు రస్తా లేకుండా పోయిందని వాపోయారు. ఇంజనీర్లతో మాట్లాడి న్యాయం చేస్తామని హామీ ఇచ్చారు.

డీజీపీని కలిసిన ఎమ్మెల్యే



డీజీపీతో ఎమ్మెల్యే

ఆదోని, డిసెంబరు 24 (ఆంధ్రజ్యోతి): జనవరి నెల 5న నిర్వహించనున్న హైందవ శంఖారావంపై ఎమ్మెల్యే పార్థసారథి విజయవాడలో డీజీపీ ద్వారకా తిరుమల రావుతో చర్చించారు. పూర్తిగా సహకారం అందిస్తామని డీజీపీ హామీ ఇచ్చినట్లు ఎమ్మెల్యే తెలిపారు.

బెల్లం ఊట ధ్వంసం



బెల్లం ఊటను ధ్వంసం చేస్తున్న ఎక్సైజ్ అధికారులు

పత్తికొండ టౌన్, డిసెంబరు 24 (ఆంధ్రజ్యోతి): రేళ్లపాడు తండా, మద్దికెర శివారులో మంగళవారం ఎక్సైజ్ అధికారులు బెల్లం ఊటను ధ్వంసం చేశారు. పత్తికొండ ఎక్సైజ్ సీఐ విశ్వేశ్వరరావు, ఎస్ఐ సాయిప్రసాద్ ఆధ్వర్యంలో సిబ్బంది దాడులు చేశరు.

వివక్ష చూపితే కఠిన చర్యలు



మాట్లాడుతున్న తహసీల్దార్, సీఐ

ఆదోని రూరల్ డిసెంబరు 24 (ఆంధ్రజ్యోతి): దళితుల పట్ల వివక్ష చూపితే కఠిన చర్యలు తీసుకుంటామని తహసీల్దార్ శివరాముడు, రూరల్ సీఐ నల్లప్ప, పెద్దతుంబళం ఎస్.ఐ మహేష్ కుమార్ హెచ్చరించారు. మండలంలోని జి.హొసళ్లి గ్రామంలో దేవర సందర్భంగా అగ్ర కులాల వారు వివక్ష చూపారని దళితుల ఫిర్యాదు చేశారు. దీంతో మంగళవారం అధికారులు గ్రామంలో పర్యటించారు.

సెమీ క్రిస్మస్ వేడుకలు

ఆస్పరి, డిసెంబరు 24 (ఆంధ్రజ్యోతి): స్థానిక నారాయణ ప్రైమ్ స్కూల్‌లో సెమీ క్రిస్మస్ వేడుకలు మంగళవారం నిర్వహించారు. కరస్పాండెంట్ నరేష్ ఆచారి మాట్లాడుతూ యేసుక్రీస్తు లోకరక్షకుడని అన్నారు. హెచ్ఎం హరిప్రసాద్, గాయత్రి, లావణ్య, చంద్రకళ, నిర్మల, అంజనమ్మ, సౌమ్య, రమాదేవి, పద్మావతి, తులసి పాల్గొన్నారు.

వీధి కుక్కల పట్టివేత

- చిన్నారిపై దాడితో అధికారుల చర్యలు



పట్టణంలో వీధి కుక్కలను పడుతున్న సిబ్బంది

పత్తికొండ, డిసెంబరు 24 (ఆంధ్రజ్యోతి): పట్టణంలో ప్రమాదకరంగా మారిన వీధికుక్కలను పంచాయతీ ఆధ్వర్యంలో పట్టివేశారు. ఈవో నరసింహులు మాట్లాడుతూ సోమవారం తేరుబజార్‌లో ఓ చిన్నారిపై వీధి కుక్కలు దాడిచేశాయని, తమను కాపాడాలని స్థానికులు ఫిర్యాదు చేశారన్నారు. కుక్కలను పట్టడంలో నిపుణుల ఆధ్వర్యంలో వీటిని పడుతుఆన్నమని, వారం పాటు ఈకార్యక్రమం నిర్వహిస్తామన్నారు. అనంతరం కుక్కలను అటవీ ప్రాంతంలో వదిలిపెడతామన్నారు. సిబ్బంది మర్రిస్వామి, రామాంజినేయులు ఉన్నారు.

మీటింగ్ కట్టను అభివృద్ధి చేస్తాం: ఈవో

పత్తికొండ, డిసెంబరు 24(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని తేరుబజార్‌లో ఉన్న మీటింగ్‌కట్టను అభివృద్ధి చేస్తామని ఈవో నరసింహులు అన్నారు. 'చెత్తకుప్పగా మీటింగ్‌కట్ట' పేరిట మంగళవారం ఆంధ్రజ్యోతిలో కథనం ప్రచురితమైంది. ఇందుకు స్పందించిన ఈవో రహదారి పనులు పూర్తికాగానే నిధులు కేటాయించి ఆదునీకరిస్తామన్నారు.

యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలి

దేవనకొండ, డిసెంబరు 24 (ఆంధ్రజ్యోతి): విద్యార్థి మృతికి కారణమైన కర్నూలు కెవీ సుబ్బారెడ్డి కళాశాల యాజమాన్యంపై చర్యలు తీసుకొవాలని డీవైఎఫ్ఐ కార్యదర్శి శ్రీనివాసులు డిమాండ్ చేశారు. విద్యార్థి రాంప్రసాద్‌రెడ్డి బావిలో శవంగా మారడంపై విచారణ చేసి, నిందితులను కఠినంగా శిక్షించాలన్నారు. యాజమాన్యానికి ఫీజులు వసూలు చేయడంలో వున్న శ్రద్ధ విద్యార్థులకు రక్షణ కల్పించడంలో లేదన్నారు. కళాశాల యాజమాన్యంపై చర్య తీసుకొవాలన్నారు.

క్రీస్తు జననం.. మానవాళికి శుభదినం

- నేడు క్రిస్మస్
- అర్ధరాత్రి నుంచి ప్రారంభమైన వేడుకలు

ఆదోని అగ్రికల్చర్/ ఆలూరు/ పత్తికొండ/ వెల్దుర్తి/ దేవనకొండ/ డిసెంబరు 24 (ఆంధ్రజ్యోతి): సమస్త మానవజాతి సుఖశాంతులతో జీవించాలని ఉద్బోధించిన మహనీయుడు యేసుక్రీస్తు. ప్రేమతత్వంతో, కరుణాగుణంతో, దయార్థ భావనలతో పొరుగువాడి పట్ల ఆప్యాయత కలిగి ఉండాలని ప్రబోధించి, మానవజాతి పాప పరిహారం కోసం తాను శిలువ మోసిన చారిత్రక పురుషుడు క్రీస్తు. ఆ మహనీయుని పుట్టినరోజు వేడుక 'క్రిస్మస్' పండుగను బుధవారం అన్ని ప్రాంతాల్లో క్రైస్తవులు ఘనంగా నిర్వహించుకోనున్నారు. ఈ సందర్భంగా ప్రత్యేక క్రిస్మస్ ప్రార్థనలకు అన్ని క్రైస్తవ మందిరాలు ముస్తాబు అయ్యాయి. రంగు రంగుల విద్యుత్తు దీపాలతో చర్చిలను ఆకర్షణీయంగా తీర్చి దిద్దారు. చర్చిలపై నక్షత్రాలను ఎగురవేశారు. కొన్ని చర్చిలలో క్రీస్తు జననానికి సంకేతంగా ఆయన పుట్టిన పశువుల పాక నమూనాలు అందంగా అలంకరించారు. ఉభయ జిల్లాలలోని పట్టణ ప్రాంతాలలో క్రిస్మస్ వేడుకల సందడి బాగా కానవస్తోంది. క్రిస్మస్ రోజున ఉదయం నుంచీ ఆయా చర్చిలలో క్రీస్తు ఆరాధనలు నిర్వహించనున్నారు. క్రిస్మస్ వేడుకల్లో భాగంగా మంగళవారం అర్ధరాత్రి నుంచి వివిధ చర్చిలలో క్రీస్తు జనన వేడుక సందర్భంగా ప్రత్యేక ప్రార్థనలు ఆరంభించారు. ఆయా చర్చిలలోపల క్రిస్మస్ స్టార్లు, క్రిస్మస్ ట్రీలు, క్రిస్మస్ బెల్స్‌తోపాటు రంగుల బెలూన్లు, కాగితాల తోరణాలతో శోభాయమానంగా ముస్తాబు చేశారు. మంగళవారం రాత్రి జరిగిన ప్రార్థనల్లో కొన్ని చర్చిలలో శాంతాక్లాజ్‌ల వేషధారణలో పిల్లలకు చాక్లెట్లు, బిస్కెట్లు పంపిణీ చేశారు.



పత్తికొండలో క్రైస్తవుల ప్రార్థనలు



విద్యుత్ కాంతులతో ఆలూరులోని సీఎస్ఐ చర్చి



ఆదోని ఆర్‌సీఎం చర్చి...



దేవనకొండలో..



తుగ్గలిలో..

ఆక్రమణదారులపై చర్యలు తీసుకోండి



పంచాయతీ సమావేశంలో మాట్లాడుతున్న అధికారులు

మద్దికెర, డిసెంబరు 24 (ఆంధ్రజ్యోతి): పంచాయతీ స్థలాల ఆక్రమణదారులపై చర్యలు తీసుకోవాలని పంచాయతీ సభ్యులు జంబునాథ్ రాయుడు, వరప్రసాద్, కవిరెడ్డి కృష్ణ కోరారు. మంగళవారం సర్పంచ్ బండారు సుహాసిని అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. అక్రమ కట్టడాల తొలగింపులో సమన్యాయం చేయాలని రాజకీయ ఒత్తిళ్లకు తలొగ్గవద్దన్నారు. చిరువ్యాపారులకు గదులు నిర్మించి ఇస్తే వారు ఉపాధి పొందుతారని తెలిపారు. సర్పంచ్ సుహాసిని, పంచాయతీ కార్యదర్శి శివకుమార్ మాట్లాడుతూ మద్దికెర గ్రామంలోని మెయిన్‌బజారులో 14, ప్రభుత్వ వైద్యశాల వద్ద 12 గదులను నిర్మించామని, స్థానికులకే ప్రాధాన్యమిస్తామన్నారు. సలహాదారులు బండారు ఆంజనేయులు, ఉప సర్పంచ్ ప్రమీలమ్మ తదితరులు ఉన్నారు.

సమస్యల పరిష్కారానికి పోరాటాలు



కార్మికులను సన్మానిస్తున్న సీఐటీయూ నాయకులు

ఆలూరు రూరల్, డిసెంబరు24 (ఆంధ్రజ్యోతి): ఆటో కార్మికుల సమస్యల పరిష్కారానికి పోరాటాలకు సిద్ధం కావాలని సీపీఎం ఆలూరు కార్యదర్శి పి.హనుమంతు, సీఐటీయూ సహాయ కార్యదర్శి కేపీ నారాయణస్వామి పిలుపు నిచ్చారు. మంగళవారం జ్యోతిబసు భవన్‌లో ఆటో కార్మికుల జనరల్ బాడీ సమావేశం విఠల్ అధ్యక్షతన నిర్వహించారు. ఫైనాన్స్ ఏజెన్సీలు, ఆర్టీవో, పోలీసుల వేధింపులతో దినదిన గండంగా ఆటో కార్మికులు జీవిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం కల్పిస్తే రోడ్డున పడతారన్నారు. అనంతరం కమిటీని ఎన్నుకున్నారు.

జీవో 77ను రద్దు చేయాలి



అంబేడ్కర్ సర్కిల్‌లో ధర్నా నిర్వహిస్తున్న నాయకులు

ఆస్పరి, డిసెంబరు24 (ఆంధ్రజ్యోతి): జీవో 77ను రద్దు చేయాలని ఏఐఎస్ఎఫ్ జిల్లా సహాయ కార్యదర్శి ఎస్ శరత్ కుమార్ డిమాండ్ చేశారు. మంళగవారం అంబేడ్కర్ సర్కిల్‌లో భిక్షాటన చేస్తూ నిరసన తెలిపారు. రూ.2,100కోట్ల ఫీజు రీయింబర్స్‌మెంట్, రూ.1,480కోట్ల వసతి దీవెన్ పెండింగ్‌తో విద్యార్థులు సర్టిఫికెట్లు పొందలేక పోతున్నారు.

నోటిఫికేషన్ విడుదల చేయాలి

ఆలూరు రూరల్, డిసెంబరు24 (ఆంధ్రజ్యోతి): విద్యుత్ శాఖలో ఖాళీగా ఉన్న పోస్టులకు నోటిఫికేషన్ విడుదల చేయాలని సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి కెపి నారాయణ స్వామి, మండల కార్యదర్శి షాకీర్ సీపీఎం నాయకుడు హనుమంతు డిమాండ్ చేశారు. మంగళవారం హొళగుంద మండలం కోగిలతోట సబ్ స్టేషన్ ఏఈ గుర్రప్పకు వినతిపత్రం అందజేశారు.

ఎస్టీ విద్యార్థులపై ప్రభుత్వ నిర్లక్ష్యం

ఆలూరు రూరల్, డిసెంబరు 24 (ఆంధ్రజ్యోతి): గిరిజన విద్యార్థుల పట్ల ప్రభుత్వం నిర్లక్ష్యం చూపుతోందని డీవైఎఫ్ఐ, ఎస్ఎఫ్ఐ నాయకులు ప్రశ్నించారు. మంగళవారం విద్యార్థులు, తల్లిదండ్రులతో కలిసి నిరసన తెలిపారు. డివైఎఫ్ఐ కార్యదర్శి షైన, ఎస్ఎఫ్ఐ మండల అధ్యక్షుడు ఉమేష్ మాట్లాడుతూ ఉపాధ్యాయులు 40 రోజులుగా సమ్మెలో ఉండటంతో విద్యార్థులు చదువుకు దూరమవుతున్నారన్నారు. రెండు నెలల్లో పబ్లిక్ పరీక్షలు ఉన్నాయని, ఎలా చదువుకోవాలని విద్యార్థులు ఆవేదన వ్యక్తం చేశారు. ఎస్ఎంసీ ఛైర్మన్ శంకర్ నాయక్, వైస్ ఛైర్మన్ లెక్క నాయక్, నీలకంఠ నాయక్, రవి నాయక్, డాకే నాయక్, డివైఎఫ్ఐ నాయకులు వీరేష్ తదితరులు పాల్గొన్నా రు.

తప్పులను సరి చేయాలి

తుగ్గలి, డిసెంబరు 24 (ఆంధ్రజ్యోతి): రీసర్వేలో చోటుచేసుకున్న తప్పులను సరి చేయాలని రైతులు కోరారు. మంగళవారం లింగనాయునిదొడ్డిలో తహసీల్దార్ రమాదేవి రెవెన్యూ సదస్సు నిర్వహిం చారు.

దరఖాస్తు చేసుకోండి

తుగ్గలి, డిసెంబరు 24 (ఆంధ్రజ్యోతి): ఖాళీగా ఉన్న రేషన్ షాపులకు దరఖాస్తు చేసుకోవాలని తహసీల్దార్ రమాదేవి కోరారు. ఎద్దులదొడ్డి, శభాష్‌పురం, జిజి రాళ్ల, మారెళ్ల గ్రామాల్లో రేషన్ షాపులు ఖాళీగా ఉన్నాయని తెలిపారు.

పరిష్కరించాలి

మద్దికెర, డిసెంబరు 24 (ఆంధ్రజ్యోతి): భూ సమస్యలను పరిష్కరించాలని బసినేపల్లి, మదనంతపురం గ్రామాల రైతులు కోరారు. మంగళవారం బసినేపల్లి గ్రామ సచివాలయంలో రెవెన్యూ సదస్సు నిర్వహించారు. తహసీల్దార్ హుశేన్ సాహెబ్‌తో రైతులు మాట్లాడుతూ గత వైసీపీ ప్రభుత్వ హయాంలో రీసర్వే వల్ల భూములు కోలోయామన్నారు. తమకు పాసుపుస్తకాలు అందేలా చూడాలని విన్నవించారు. మాజీ సర్పంచ్ శివన్న, ప్రతాప్, వీఆర్వో శివన్న ఉన్నారు.

రెవెన్యూ సదస్సు

వెల్దుర్తి, డిసెంబరు 24(ఆంధ్రజ్యోతి): మండలంలో మల్లెపల్లె గ్రామంలో మంగళవారం తహసీల్దార్ చంద్రశేఖరవర్మ ఆధ్వర్యంలో రెవెన్యూ సదస్సు నిర్వహించారు. సర్వేయర్ హేమంత్‌రెడ్డి, ఆర్ఐ ప్రసాద్ పాల్గొన్నారు.

ఏజెన్సీని తొలగించాలి

ఆస్పరి, డిసెంబరు24 (ఆంధ్రజ్యోతి): నగరూరు గ్రామ జడ్పీ ఉన్నత పాఠశాలలో మధ్యాహ్న భోజన వంట ఏజెన్సీని ఎస్ఎఫ్ఐ నాయకులు తహసీల్దార్ శివ శంకర్ నాయక్‌కి వినతిపత్రం అందించారు. ఎంఈవోకు ఫిర్యాదు చేసినా సమస్య పరిష్కారం కాలేదన్నారు

నాణ్యత ఉండాలి

మద్దికెర, డిసెంబరు 24 (ఆంధ్రజ్యోతి): మండలంలోని బురుజుల, ఎం.అగ్రహారం గ్రామాల్లో చేస్తున్న అభివృద్ధి పనుల్లో నాణ్యత నాణ్యత పాటించాలని ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ మయాంక్, ఇంజనీర్లు విష్ణు, సురేష్, చంద్ర సూచించారు. బురుజుల, ఎం.అగ్రహారం గ్రామాల్లో చేస్తున్న అభివృద్ధి పనులను పరిశీలించారు.

విద్యుత్ చార్జీల పెంపు అన్యాయం

- వైసీపీ పోరుబాట పోస్టర్ల విడుదల



మాట్లాడుతున్న ఎమ్మెల్సీ మధుసూదన్



పోస్టర్లు విడుదల చేస్తున్నఎమ్మెల్యే విరుపాక్షి

ఆదోని అగ్రికల్చర్, డిసెంబరు 24 (ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వం విద్యుత్ చార్జీలు పెంచడం అన్యాయమని ఎమ్మెల్సీ మధుసూదన్ వైసీపీ పట్టణ గౌరవాధ్యక్షుడు చంద్రకాంత్ రెడ్డి అన్నారు. మంగళవారం వైసీపీ కార్యాలయంలో నిరసన గోడ పత్రికలను విడుదల చేశారు. అధికారంలో రాకముందు తమకు అవకాశం ఇస్తే విద్యుత్ భారాన్ని మోపమని చంద్రబాబు హామీ ఇచ్చారన్నారు. విద్యుత్ చార్జీలు పెంచడమే కాకుండా ఒకటో తేదీ నుంచి రిజిస్ట్రేషన్ చార్జీలు కూడా పెంచుతున్నారని ఆరోపించారు. ఈనెల 27న వైసీపీ కార్యాలయం నుంచి విద్యుత్ డీఈ కార్యాలయం ర్యాలీ చేపడుతున్నట్లు తెలిపారు. వైస్ చైర్మన్ నరసింహులు, గౌస్, కౌన్సిలర్లు పయాజ్, సందీప్ రెడ్డి, చలపతి, మధు, గోపాల్ రెడ్డి పాల్గొన్నారు.

పోరుబాటకు సిద్ధం కండి : ఎమ్మెల్యే

ఆలూరు: విద్యుత్ చార్జీల పెంపుపై పోరుబాటకు సిద్ధం కావాలని ఆలూరు ఎమ్మెల్యే విరుపాక్షి పిలుపునిచ్చారు. 27న తలపెట్టిన విద్యుత్ చార్జీల పెంపుపె నిరసన గోడ పత్రికలను మంగళవారం విడుదల చేశారు.

పెంచిన విద్యుత్ చార్జీలను తగ్గించాలి

వెల్దుర్తి టౌన్: కూటమి ప్రభుత్వం పెంచిన విద్యుత్ చార్జీలను తగ్గించాలని మాజీ ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవి డిమాండ్ చేశారు. ఈ నెల 27న వైసీపీ ఆధ్వర్యంలో నిర్వహించనున్న పోరుబాట పోస్టర్లను విడుదల చేశారు. క్రిష్ణగిరి ఎంపీపీ వెంకట్రామిరెడ్డి, వెల్దుర్తి జడ్పీటీసీ సుంకన్న, పత్తికొండ ఎంపీపీ నారాయణదాసు, బాస్కర్ రెడ్డి, బొమ్మిరెడ్డిపల్లె మధుసూదన్ రెడ్డి, రత్నపల్లె రాంనాథ్ రెడ్డి, కురువ రామకృష్ణ, శ్రీధర్ రెడ్డి పాల్గొన్నారు.

గుంతను పూడ్చారు..

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్



గుంతను పూడ్చిన అధికారులు

మద్దికెర, డిసెంబరు 24 (ఆంధ్రజ్యోతి): మద్దికెర నుంచి బురుజుల మీదుగా పత్తికొండకు వెళ్లే రహదారిలో హోసూరు వంక వద్ద ఎట్టకేలకు గుంతను పూడ్చారు. ఇదే వంక వద్ద ఈ నెల 16న వీఆర్వో శ్రీనివా సులు గుంతలో పడి మృత్యువాత పడ్డారు.ఈ నెల 17వ తేదీన 'మృత్యుదారి' శీర్షికన ఆంధ్ర జ్యోతిలో కథనం ప్రచురితమైంది. ఇందుకు స్పందించిన ఆర్అండ్‌బీ అధికారులు ప్రమాదం చోటు చేసుకున్న స్థలంలో తారోడ్డును వేశారు. నూతన రహదారికి నిధులు మంజూరయ్యాయని, వేసవి కాలంలో పనులు మొదలు ప్రారంభిస్తామని ఆర్అండ్‌బీ అధికారులు తెలిపారు.

తాగునీటి సమస్య తలెత్తకుండా చూడండి



మాట్లాడుతున్న ఆర్‌డబ్ల్యూఎస్ ఈఈ పద్మ

ఆదోని రూరల్ డిసెంబరు 24 (ఆంధ్రజ్యోతి): వేసవిలో తాగునీటి సమస్య తలెత్తకుండా చూడాలని ఆర్‌డబ్ల్యూఎస్ ఈఈ పద్మ సూచించారు. మంగళవారం డీఎల్‌పీవో నూర్జహాన్ అధ్యక్షతన పెసలబండ తాగునీటి స్కీం పరిధిలోని 16 గ్రామాల సర్పంచులు, ఆర్‌డబ్ల్యూఎస్ కాంట్రాక్టర్లతో సమావేశం నిర్వహించారు. తాగునీటి పైపులైన్లు లీకేజీకి గురికాకుండా చూసుకోవాలని, కొళాయిలకు బిరడా బిగించా లన్నారు. ఏఈ మధుసూదనాచారి, ఈవోఆర్డీ జనార్ధన్ పాల్గొన్నారు.

కురువలకు రుణాలు..

ఆదోని , డిసెంబరు 24(ఆంధ్రజ్యోతి): కురువలకు కార్పొరేషన్ ద్వారా రుణాలను ఇస్తామని ఛైర్మన్ మాన్వి దేవేంద్రప్ప అన్నారు. మంగళవారం విజయవాడలో బీసీ కార్పొరేషన్ అధికారులతో చర్చించారు. ఆయన వెంట డైరెక్టర్ రామకృష్ణ ఉన్నారు.



బీసీ కార్పొరేషన్ ఛైర్మన్‌తో దేవేంద్రప్ప

ప్రమాణ స్వీకారంలో ఆలూరు నాయకులు



శ్రీనివాస రెడితో నారాయణ రెడ్డి, లక్ష్మీనారాయణ రెడ్డి

ఆలూరు/పత్తికొండ డిసెంబరు24 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర వ్యవసాయ మిషన్ వైస్ ఛైర్మన్‌గా మర్రెడ్డి శ్రీనివాసరెడ్డి విజయవాడలో ప్రమాణ స్వీకారం చేశారు. ఆలూరుకు చెందిన తెలుగు రైతు కార్యదర్శి సీఎస్ నారాయణరెడ్డి, పత్తికొండకు చెందిన కార్యనిర్వాహక కార్యదర్శి కాకర్ల లక్ష్మీనారాయణ శుభాకాంక్షలు తెలిపారు.

రామాయణం ఆదర్శం

పత్తికొండ టౌన్, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి): రామాయణం ఆదర్శమని టీటీడీ హిందూ ధర్మ ప్రచార పరిషత్ జిల్లా కార్యనిర్వహకుడు డా.మల్లు వెంకటరెడ్డి అన్నారు. మంగళవారం స్థానిక వ్రెంకటేశ్వర ఆలయంలో ధార్మిక కార్యక్రమాలను ప్రారంభించారు. రంగ స్థల కళాకారుడు పెద్ద రంగారెడ్డి సంగీత పవచనాలు ఆకట్టుకున్నాయి. వీర్రాజు, రామలింగయ్య, తెలుగు పండితులు రాజా జయవర్దన్, వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

సీపీఐ వార్షికోత్సవాలు జయప్రదం చేయండి

పత్తికొండ టౌన్, డిసెంబరు 24 (ఆంధ్రజ్యోతి): సీపీఐ వందేళ్ల వారోత్సవాలను జయప్రదం చేయాలని ఆ పార్టీ కార్యదర్శి రాజాసాహెబ్, సహాయ కార్యదర్శి రంగన్న, పట్టణ కార్యదర్శి రామాంజనేయులు పిలుపు నిచ్చారు. మంగళవారం సీఆర్ భవన్‌లో మాట్లాడుతూ పట్టణంలోని ప్రధాన కూడళ్లలో సీపీఐ జెండా ఆవిష్కరణ ఉంటుందన్నారు. 26న బైక్ ర్యాలు, పార్టీ కార్యాలయం ఆవరణలో సభ ఉంటుందన్నారు. మునిస్వామి పాల్గొన్నారు.

ముగిసిన రెవెన్యూ సదస్సులు

దేవనకొండ, డిసెంబరు 24 (ఆంధ్రజ్యోతి): మండలంలో రెవెన్యూ సదస్సులు మంగళవారంతో ముగిసినట్లు తహసీల్దార్ లోకేశ్వరయ్య తెలిపారు. ఈనెల 6 నుంచి ప్రారంభిచామని 15 గ్రామాల నుంచి 135 దరఖాస్తులు వచ్చాయన్నారు.

రూ.27 కోట్లతో బీటీ రోడ్లకు ప్రతిపాదనలు

ఆంధ్రజ్యోతి ఇంటర్వ్యూ

- పీఆర్ ఏఈ ఉదయ్‌కుమార్



దేవనకొండ, డిసెంబరు 24 (ఆంధ్రజ్యోతి): మండలంలో రూ.27 కోట్లతో బీటీ రోడ్డు నిర్మించేందుకు ప్రతిపాదనలు పంపినట్లు పంచాయతీ రాజ్ ఏఈ ఉదయ్‌కుమార్ అన్నారు. ఆంధ్రజ్యోతికి ఇంటర్వ్యూ ఇచ్చారు.

ప్రశ్న: ఎన్ని గ్రామాల్లో సీసీ రోడ్ల పనులు జరుగుతున్నాయి?

జవాబు: మండలంలోని 15 గ్రామ పంచాయతీల్లో రూ.2.13 కోట్లతో సీసీ రోడ్డు వేస్తున్నాం. 33 ప్రాంతాల్లో రోడ్లు నిర్మించాల్సి ఉండగా, 26 ప్రాంతాల్లో ఇప్పటికే పనులు పూర్తయ్యాయి.

ప్రశ్న: పంచాయతీరాజ్ బీటీ రోడ్లకు మరమ్మతలు చేస్తున్నారా?

జవాబు: బీటీ రోడ్ల మరమ్మతులకు రూ.3 కోట్లతో ప్రతిపాదనలు పంపాం. కేబీ (కర్నూలు-బళ్లారి) రోడ్డు- అలారుదిన్నె, కేబీ రోడ్డు - పోట్లపాడు వయా కుంకనూరు, కేబీ రోడ్డు - జిల్లెలబుడకల వయా కప్పట్రాళ్ల రోడ్ల మరమ్మతులకు ప్రతిపాదనలు పంపాం.

ప్రశ్న: నూతన బీటీ రోడ్ల వివరాలు?

జవాబు: రూ.27 కోట్లతో ప్రతిపాదనలు పంపాం. పి.కోటకొండ క్రాస్ - బేతపల్లి రూ.6 కోట్లు, కేబీ రోడ్డు - గద్దెరాళ్ల రూ.2.50 కోట్లు , కరివేముల నుంచి జిల్లెల బుడకల రూ.3.5 కోట్లు, కెబీ రోడ్డు-కౌలుట్లయ్య ఆలయం రూ.6కోట్లు, కెబీ రోడ్డు- బండ గట్లు రూ.6 కోట్లు, పుల్లాపురం - తెర్నేకల్ రూ.3 కోట్లతో ప్రతిపాదనలు పంపాము. అనుమతులు రాగానే పనులు చేస్తాం.

ప్రశ్న: మిగిలిన 12 పంచా యతీలకు రెండో విడతలో సీసీ రోడ్లు మంజూరయ్యే అవరాశం ఉందా?

జవాబు: రెండో విడతలో 12 గ్రామాల్లో సీసీ రోడ్ల నిర్మాణానికి రూ.3కోట్లతో ప్రతిపాదనలు పంపాం. అలాగే అత్యవసరంగా రోడ్లు వేయాల్సిన చోట కుడా పూర్తి చేస్తాం.

అమిత్‌షాను బర్తరఫ్ చేయాలి



ధర్నా చేస్తున్న ప్రజాసంఘాల నాయకులు

గోనెగండ్ల, డిసెంబరు 24(ఆంధ్రజ్యోతి): అంబేడ్కర్‌పై అనుచిత వాఖ్యలు చేసిన కేంద్ర హోం మంత్రి అమిత్‌షాను పదవి నుంచి వెంటనే బర్తరఫ్ చేయాలని కేవీపీఎస్ జిల్లా ప్రధాన ప్రధాన కార్యదర్శి ఆనంద్ బాబు, ఎస్ఎఫ్ఐ నాయకులు రంగస్వామి, సాయిఉదయ్, యూటీఎఫ్ నాయకులు నరసింహ, ఎపీడీకేఎస్ జిల్లా కార్యదర్శి కరుణాకర్ డిమాండ్ చేశారు. మంగళవారం గాజులదిన్నె ప్రాజెక్టు సమీపంలోని అంబేడ్కర్ విగ్రహం దగ్గర అర గంట సేపు ధర్నా నిర్వహించారు. కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఈసందర్భంగా వారు మట్లాడుతూ బీజేపీ పార్టీ కుల, మతాల పేరుతో ప్రజల మధ్య చిచ్చు పెడుతుందన్నారు. ప్రభుత్వరంగ సంస్థలను పూర్తిగా ప్రైవేట్ పరం చేస్తు ఆదానీ, అంబానీలకు దోచిపెడుతున్నారని ఆరోపించారు. కార్యక్రమంలో రైతు సంఘం నాయకులు నరసింహులు, శివ, శేఖర్, ప్రజాసంఘాల నాయకులు పాల్గొన్నారు.

పెండింగ్ సమస్యలు పరిష్కరించాలి

పెద్దకడుబూరు , డిసెంబరు 24(ఆంధ్రజ్యోతి): రీ సర్వేలో పెండింగ్ సమస్యలను త్వరగా పరిష్కరించాలని టీడీపి రాష్ట్ర రైతు సంఘం అధికార ప్రతినిధి రమాకాంత్ రెడ్డి అన్నారు. మంగళవారం పెద్దకడబూరులోని తహసీల్దార్ శ్రీనాథ్‌తో ఆయన మాట్లాడారు. భూసమస్యలు మండలంలో అధికంగా ఉన్నాయని సమస్యలు చెప్పుకునెందుకు వచ్చిన రైతులను అనేకసార్లు తిప్పుకోవడం సమంజసం కాదన్నారు. రైతులు భూములును యాజమానులకు తెలియకుండా వేరే వారికి రిజిస్ట్రేషన్ చేసుకుంటున్నారని ఆయన ఆరోపించారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు మల్లికార్జున, మీసేవ అంజినేయులు, బొగ్గుల తిక్కన్న, తలారి అంజి పాల్గొన్నారు.

శ్రీమఠం రూములకు ఒత్తిడి తేవొద్దు

ఇప్పటికే గదులన్నీ బుకింగ్



రాఘవేంద్రస్వామి మఠం ముఖద్వారం

మంత్రాలయం, డిసెంబరు 24(ఆంధ్రజ్యోతి): మంత్రాలయం రాఘవేంద్రస్వామి దర్శనార్థం వచ్చే భక్తులు 25 నుంచి జనవరి 2వ తేదీ వరకు ప్రముఖులు పేర్లతో సిఫారసులను తీసుకురావద్దని మఠం ఏఏవో మాధవశెట్టి, మఠం మేనేజర్ వెంకటేశ్ జోషి, మేనేజర్ సురేష్ కోనాపూర్ తెలిపారు. 25న క్రిస్మస్, 31న, జనవరి 1న వేలాది మంది భక్తులు తరలివస్తున్నారని, ఇప్పటికే ఆన్‌లైన్ ద్వారా రూములన్నీ బుకింగ్‌ను అయిపోయాయని తెలిపారు. ఇది భక్తులు గమనించాలని కోరారు.

సమస్యలపై అధికారులు దృష్టి సారించాలి

మండల సమావేశంలో ఎంపీపీ గిరిజమ్మ



మాట్లాడుతున్న ఎంపీపీ గిరిజమ్మ

మంత్రాలయం, డిసెంబరు 24(ఆంధ్రజ్యోతి): మండలంలోని గ్రామాల్లో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలపై అధికారులు, ప్రజాప్రతినిధులు దృష్టి సారించాలని ఎంపీపీ గిరిజమ్మ అన్నారు. మంగళవారం ఎంపీడీవో కార్యాలయంలో ఎంపీడీవో శోభారాణి అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశాన్ని నిర్వహించారు. ఈ సమావేశంలో తాగునీరు, రోడ్లు, సీసీ రోడ్లు, డ్రైనేజీ, విద్యుత్, సాగునీరు విద్య, వైద్యం, గృహ నిర్మాణం, అంగన్‌వాడీల నిర్వహణ, వ్యవసాయం పొదుపు గ్రూపుల సమస్యలు, పశువైద్యం వంటి అంశాలపై చర్చించారు. ఆమె మాట్లాడుతూ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు ప్రజలందరికీ అందేవిధంగా అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. రాజకీయాలకు అతీతంగా గ్రామాల్లో సీసీ రోడ్లు, డ్రైనేజీ, తాగునీటి సమస్య తీర్చాలన్నారు. సర్పంచులు, ఎంపీటీసీల సహకారంతో అధికారులు గ్రామాల్లో పర్యటించాలని, నూతన గృహాల మంజూరుకు దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు తెలిపారు. అనంతరం ఏఈ మల్లయ్య మాట్లాడుతూ రూ.2.5 కోట్లతో సీసీ రోడ్ల నిర్మాణ పనులు సాగుతున్నాయన్నారు. ఈ సమావేశంలో వ్యవసాయ సలహా మండలి మాజీ చైర్మన్ సీవీ విశ్వనాథరెడ్డి, వైస్ ఎంపీపీ పులికుక్క రాఘవేంద్ర, ఈవోఆర్డీ ప్రభావతి దేవి, సర్పంచులు తెల్లబండ్ల భీమయ్య, అంజినేయ, వీరారెడ్డి, లింగారెడ్డి, ఎంఈవో మైనుద్దీన్; ఎంపీటీసీలు వెంకటేశ్ శెట్టి, రామాంజనేయులు, కార్యదర్శులు వేణుగోపాల్, మహేష్, ఇస్రత్‌బాషా, స్వామినాథన్ పాల్గొన్నారు.

రెవెన్యూ సదస్సులను వినియోగించుకోండి



అర్జీలను పరిశీలిస్తున్న తహసీల్దార్ రవి

మంత్రాలయం, డిసెంబరు 24 (ఆంధ్రజ్యోతి): రెవెన్యూ సదస్సులను వినియోగించుకోవాలని తహసీల్దార్ ఎస్.రవి రైతులకు సూచించారు. మంగళవారం మండలంలోని రచ్చుమర్రి గ్రామంలో వీఆర్వో నరసప్ప అధ్యక్షతన రెవెన్యూ సదస్సు నిర్వహించారు. గ్రామంలో రీసర్వే పేరుతో రైతులకు జరిగిన నష్టంపై రైతులు అర్జీలు ఇచ్చారు. ఆర్ఐ ఆదాం, మండల సర్వేయర్ అశోక్, వీఆర్వోలు ఆనందు, ప్రభాకర్, నాగేష్, సర్వేయర్లు తిమ్మేష్, ఉరుకుందాచారి, అనూష, రైతులు పాల్గొన్నారు.

గోనెగండ్ల: రైతుల భూసమస్యలను పరిష్కరించేందుకు రెవెన్యూ సదస్సులను ప్రభుత్వం నిర్వహిస్తుందని తహసీల్దార్ కుమారస్వామి అన్నారు. మంగళవారం మండలంలోని ఎర్రబాడు గ్రామంలో రెవెన్యూ సదస్సు నిర్వహించారు. తమ భూముల్లో గతంలో సర్వే సక్రమంగా నిర్వహించలేదని కొందరు రైతులు, మాకు రావాల్సి ఉన్న భూమి ఇక తక్కువగా ఉంది అంటు కొందరు హద్దులు సక్రమంగా చూపలేదని మరి కొందరు అధికారులు దృష్టికి తీసుకెళ్లారు. కార్యక్రమంలో రీ సర్వే డీటీ శిరీష, జనార్దన్ రావు, ఆర్ఐ రామకృష్ణ, పాల్గొన్నారు.

కష్టం.. నష్టం

● తగ్గిన వరి దిగుబడి, గిట్టుబాటు ధర అంతంతే
● నష్టపోతున్న రైతులు
● క్వింటం వరి రూ. 2200

గోనెగండ్ల, డిసెంబరు 24(ఆంధ్రజ్యోతి): రైతన్నకు కాలం కలిసి రావడం లేదు.. ఓ వైపు తుఫాన్లు, మరో వైపు మద్దతు ధర లేక రైతు విలవిలలాడుతున్నారు. చేతికందే సమయంలో తుఫాన్లు వస్తుండడంతో పంట పూర్తిగా దెబ్బతినడంతో పాటు తెగుళ్ల సోకడంతో దిగుబడి తగ్గుతోంది. దీంతో పెట్టిన పెట్టుబడులు కూడా వచ్చే పరిస్థితులు లేవని రైతులు లబోదిబోమంటున్నారు. గోనెగండ్ల మండలంలో దాదాపు 1000 వేల ఎకరాల్లో వరి పంటను సాగు చేశారు. గాజులదిన్నె ప్రాజెక్టు కింద ఈ ఏడాది అధికంగా వరి సాగు అయింది. గాజులదిన్నె, హెచ్ కైరవాడి, కులుమాల, పుట్టపాశం, వేముగోడు, తిప్పనూరు, అలువాల, వీరంపల్లి, గోనెగండ్ల, పెద్దమరివీడు, చిన్నమరివీడు, పెద్దనేలటూరు గ్రామల్లో అధికంగా సాగు చేశారు.

ఎకరాకు పెట్టబడి రూ.45వేలపై మాటే :

ఎకరం వరి సాగుకు పెట్టుబడి రూ. 40 వేలనుంచి రూ. 45వేలు ఖర్చు అవుతోంది. వరి నార కూడా ఈ ఏడాది అధిక ధర పలికింది. దిగుబడి ఎకరా కూ 15 క్వింటాళ్ల నుంచి 20 క్వింటాళ్ల లోపే ఉంది. క్వింటం వరి ధర రూ. 2200 మాత్రమే పలుకుతుంది. దీంతో సాగు చేసిన రైతుకు నష్టం వాటిల్లుతోంది. ఇక కౌలుకు భూమి తీసుకొని సాగు చేసిన రైతన్న పరిస్థితి మరి దారుణంగా ఉంది. ఎకరా పొలానికి 13 బస్తాల నుంచి 15 బస్తాల వరకు కౌలు కింద యజమానికి ఇచ్చేలా ఒప్పందం కుదుర్చుకున్నారు. పండిన పంటలో సగం ధాన్యాం కౌలు కింద పోతే మిగిలిన ధాన్యం పండించిన రైతుల ఎంత మాత్రం సరిపోవడం లేదు. ఎకరాకు దాదాపు రూ. 10వేలు నష్టం వస్తుందని రైతులు ఆవేదన చెందుతున్నారు. మార్కెట్ గిట్టుబాటు ధర లేక పోవడంతో పొలాల్లో, ఇండ్లలో పండిన పంటను నిలువ చేసుకొని ధర కోసం ఎదురు చూస్తున్నారు. కూటమి ప్రభుత్వం అయిన ధర పెంచుతుందనే ఆశతో రైతులు ఎదురు చూస్తున్నారు.



పొలంలోనే నిల్వ ఉంచిన వరి పంట

పెట్టుబడులు కూడా రావడం లేదు



ఎకరం పొలంలో వరి పంట సాగు చేశాను 15 బస్తాలు వరి దిగుబడి వచ్చింది. పెట్టుబడి రూ. 30వేలు అయింది. చేతి నుంచి మరో రూ. 15వేలు అప్పు చేయాల్సి వచ్చింది. ఈ ఏడాది దిగుబడి బాగా తగ్గిపోయింది. ప్రభుత్వం మద్దతు ధర కల్పించి, రైతులను ఆదుకోవాలి.

హుసేన్, రైతు ఐరన్‌బండ

రైతుల సమస్యలను పరిష్కరించాలి

ఆదోని సబ్‌కలెక్టర్ మౌర్యాభరద్వాజ్

ఎమ్మిగనూరు రూరల్, డిసెంబరు 24(ఆంధ్రజ్యోతి): రైతుల సమస్యలను సత్వరమే పరిష్కరించాలని ఆదోని సబ్‌కలెక్టర్ మౌర్యాభరద్వాజ్ తెలిపారు. మంగళవారం మండలలోఓని కలుగొట్ల గ్రామంలో జరిగిన రెవెన్యూ సదస్సుకు ఆయన హాజరయ్యారు. ఈ సందర్భంగా రైతుల నుంచి వచ్చిన వినతులను స్వీకరించారు. రైతులు తమ గ్రామ సర్వేయర్‌గా పనిచేస్తున్న విజయ్‌ప్రకాష్ రైతులను ఇబ్బందులకు గురిచేయడమేగాక, బెదిరింపులకు పాల్పడుతున్నారని సబ్‌కలెక్టర్ దృష్టికి తెచ్చారు. రీ సర్వేలో తమ భూముల కొలతలను అడిగేందుకు వెళ్తే సక్రమంగా సమాధానాలు చెప్పడం లేదన్నారు. అంతేగాక సర్వే చేయకుండానే తమతో సంతకాలు చేయించుకుంటున్నాడని, సంతకాలు చేయకపోతే మిమ్మల్ని ఇబ్బందులకు గురిచేయాల్సి వస్తుందని బెదిరిస్తున్నాడని కొంతమంది రైతులు సబెకలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. దీంతో సబ్‌కలెక్టర్ సర్వేయర్ విజయ్ ప్రకాష్‌పై మండిపడ్డారు. అలాగే కొండమ్మ చెరువు బాధిత రైతులకు ప్రభుత్వం న్యాయం చేయాలని రైతులు సబ్‌కలెక్టర్‌ను కోరారు. ఇందుకు స్పందించిన సబ్‌కలెక్టర్ కొండమ్మ చెరువు బాధితులు ఎంతమంది ఉన్నారో అందరి పూర్తి వివరాలను అందించాలని తహసీల్దార్ శేషఫణికి ఆదేశించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ 40 రోజుల్లోపు అర్జీలు ఇచ్చిన రైతుల సమస్యలను పరిష్కరిస్తామన్నారు. కార్యక్రమంలో మండల సర్వేయర్ వహిద్, ఎండోమెంట్ అధికారి వెంకటేశ్వర్లు, ఆర్ఐ లక్ష్మన్న, వీఆర్వోలు సుబ్బలక్ష్మి, ఈరన్న, వరలక్ష్మి, అనంతలక్ష్మి, విజయ్ ప్రకాష్, అనుమంతమ్మ, పరుశురాము, టీడీపీ నాయకులు కొండన్నగౌడు, శంకర్‌గౌడు, లక్ష్మన్న, రైతులు పాల్గొన్నారు.



సర్వేయర్‌పై సబ్‌కలెక్టర్‌కు ఫిర్యాదు చేస్తున్న రైతులు

గోనెగండ్ల: గృహ నిర్మాణ పనులకు వేగవంతం చేయాలని ఆదోని సబ్ కలెక్టర్ మౌర్యభరద్వాజ్ కోరారు. మంగళవారం గోనెగండ్ల మండలంలోని కులమాల, చిన్నమరివీడు గ్రామాలలోని హౌసింగ్ లేఔట్‌లో నిర్మిస్తున్న గృహాలను ఆయన పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ మండలంలోని పలు గ్రామాలలో ఎన్ని గృహాలు మంజూరయ్యాయని, ఇప్పటి వరకు ఎన్ని గృహాల నిర్మాణ పనులు పూర్తయ్యాయన్నారు. పెండింగ్‌లో ఎన్ని గృహాలు ఉన్నాయని అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఎంపీడీవో మణిమంజరి, హౌసింగ్ డీఈ ప్రసాద్, ఏఈ షేక్షావలి ఉన్నారు.



విద్యుద్దీపాలంకరణలో ఎమ్మిగనూరులో ఎంబీ చర్చి

నేడు క్రిస్మస్

ముస్తాబైన చర్చిలు



ముస్తాబైన మేరీమాత మందిరం

ఎమ్మిగనూరు, డిసెంబరు 24(ఆంధ్రజ్యోతి): పట్టణంతో పాటు మండలంలోని ఆయా గ్రామాల్లోని చర్చిలు బుధవారం జరిగే క్రిస్మస్ వేడుకలకు ముస్తాబయ్యాయి. దయామయుడైన దైవకుమారుడు యేసు క్రీస్తు జన్మించిన సుదినం. ప్రతి చర్చిలో వెలుగు పూలు విరబూశాయి. బాలయేసు రాకను సూచిస్తూ విద్యుత్‌దీపాలతో ఏర్పాటు చేసిన స్టార్లు, క్రిస్మస్ ట్రీలతో సరికొత్త శోభను సంతరించుకున్నాయి. మంగళవారం రాత్రి నుంచి ప్రత్యేక ప్రార్థనలు ఆరంభించారు. అర్థరాత్రి 12 గంటల వేల క్రిస్మస్ గడియలు సమీస్తున్న తరుణంలో మందిరాల్లో విశ్వాసులు ప్రార్థనలు చేసే ప్రభువును స్వాగతించారు.

సీపీఎం జిల్లా మహాసభలను జయప్రదం చేయండి



కరపత్రాలతో సీపీఎం నాయకులు

ఎమ్మిగనూరు టౌన్, డిసెంబరు 24 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలో జరిగే సీపీఎం 23వ మహాసభలను జయప్రదం చేయాలని సీపీఎం పట్టణ అధ్యక్షుడు కే కృష్ణ, కార్యదర్శి రాముడు అన్నారు. పట్టణంలోని ఎన్టీఆర్ కాలనీలోని ఆటో కార్మికులకు 23వ మహాసభలను జయప్రదం చేయాలని కరపత్రాలు పంచుతూ ప్రచారం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పట్టణంలో ఇంటి స్థలాలు లేక ప్రజలు అవస్థలు పడుతున్నారు. పేదల సమస్యలు పరిష్కారం కోసం సీపీఎం ఆధ్వర్యంలో ఎమ్మిగనూరులో 29, 30 తేదీల్లో జరిగే 23వ జిల్లా మహాసభలకు పెద్ద ఎత్తున ప్రజలు, రైతులు హాజరై జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో చేనేత కార్మిక సంఘం పట్టణ కార్యదర్శి కాలప్ప, వలి, ఆటో కార్మికులు పాల్గొన్నారు.

మధ్యాహ్నం ఒంటి గంటకే బడికి తాళం



తాళం వేసిన ఎస్.కొట్టాల ప్రాథమిక పాఠశాల

కోసిగి, డిసెంబరు 24(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని ఎస్.కొట్టాల ప్రాథమిక పాఠశాల మధ్యాహ్నం ఒంటి గంటకే తాళం వేసి ఉపాధ్యాయులు విద్యార్థులను ఇళ్లకు పంపించేశారు. విద్యార్థుల తల్లిదండ్రులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ముందస్తు సమాచారం ఇవ్వకుండా మధ్యాహ్నానికే బడికి తాళం వేస్తే విద్యార్థులకు ఏమైనా జరిగితే ఎవరు బాధ్యులు అని ఉపాధ్యాయుల తీరుపై ఆగ్రహించారు. కోసిగి మండలానికి రెగ్యులర్ ఎంఈవో లేకపోవడంతో ఉపాధ్యాయులు ఇష్టానుసారంగా వ్యవహరిస్తున్నారని విద్యార్థి సంఘాల నాయకులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి మండలానికి రెగ్యులర్ ఎంఈవోను నియమించి, ఉపాధ్యాయులు సమయపాలన పాటించే విధంగా చర్యలు తీసుకోవాలని విద్యార్థుల తల్లిదండ్రులు, విద్యార్థి సంఘ నాయకులు కోరుతున్నారు.

రమణీయం.. వెండి గజ వాహనోత్సవం



వెండి గజ వాహనంపై ఊరేగుతున్న ప్రహ్లాదరాయలు

మంత్రాలయం, డిసెంబరు 24(ఆంధ్రజ్యోతి): మంత్రాలయం రామవేంద్ర స్వామి మఠంలో ఉత్సవమూర్తి ప్రహ్లాదరాయలు వెండి గజ వాహనంపై భక్తులకు దర్శనం ఇచ్చారు. మంగళవారం ధనుర్మాస నవమి వేడుకలను పురస్కరించుకుని శ్రీమఠం పీఠాధిపతి సుబుధేంద్ర తీర్థుల ఆధ్వర్యంలో బృందావనానికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. వేద పండితుల మంత్రోచ్చారణాలు, మంగళ వాయిద్యాల మధ్య వెండి గజవాహనం పై బంగారు అంబారీలో వజ్రాలు పొదిగిన ప్రహ్లాదరాయలను అధిష్ఠించి ఆలయ ప్రాంగణం చుట్టూ ఊరేగించారు.

మధ్యాహ్న భోజనంపై నిర్లక్ష్యం వహిస్తే చర్యలు

నందవరం, డిసెంబరు 24(ఆంధ్రజ్యోతి): పాఠశాల విద్యార్థులకు అందించే మధ్యాహ్న భోజనంపై నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని ఎంఈవో సుదర్శన్‌రెడ్డి హెచ్చరించారు. మంగళవారం నందవరం తెలుగు మెయిన్ స్కూల్‌లో మధ్యాహ్న భోజనం తనిఖీ చేశారు. పాఠశాలకు మెనూ ప్రకారం విద్యార్థులకు శుచితో పాటు, రుచికరమైన భోజనం అం దించాలని ఏజెన్సీలకు సూచించారు. ప్రధానోపాధ్యాయులు లక్ష్మీనారాయణ, ఉపాధ్యాయులు మహబూబ్‌బాషా, హసేనబీ పాల్గొన్నారు.



రికార్డులు పరిశీలిస్తున్న ఎంఈవో

సూచిక బోర్డులు ఏవి?

● చింతకుంట రోడ్డు ప్రమాదాలకు నిలయం
● పట్టించుకోని ఆర్‌అండ్‌బీ అధికారులు





ప్రమాద సూచిక బోర్డులు లేని పల్లెపాడు-చింతకుంట రోడ్డు , ప్రమాదకరంగా పల్లెపాడు మలుపు రోడ్డు

కోసిగి, డిసెంబరు 24(ఆంధ్రజ్యోతి): మండలంలోని చింతకుంట, పల్లెపాడు రోడ్డును గత ఆరు నెలల క్రితం ఎన్నికల ముందు రోడ్డు వేశారు. అయితే ఆర్‌అండ్‌బీ అధికారులు ఎలాంటి ప్రమాద హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయకపోవడంతో నిత్యం ప్రమాదాలు జరుగుతున్నాయి. గత మూడు నెలల వ్యవధిలోనే ముగ్గురు యువకులు చింతకుంట-పల్లెపాడు మలుపు రోడ్డు వద్ద బైక్ అదుపు తప్పి ప్రమాదంలో మృతి చెందారు. కొత్త రోడ్డు వేయడంతో వాహనదారులు వేగంగా వెళ్తుండడంతో ప్రమాదాలు జరుగుతున్నాయి. మలుపుల వద్ద సూచికబోర్డులు ఏర్పాటు చేయాలని అధికారులను కోరినా పట్టించుకోవడం లేదు. ఇప్పటికైనా ఆర్‌అండ్‌బీ అధికారులు చింతకుంట-పల్లెపాడు రోడ్డులో మలుపుల వద్ద సూచిక బోర్డులు ఏర్పాటు చేయాలని వాహనదారులు కోరుతున్నారు.

మంచాలమ్మకు పంచామృతాభిషేకం

మంత్రాలయం, డిసెంబరు 24(ఆంధ్రజ్యోతి): మంత్రాలయం రాఘవేంద్ర స్వామి మఠంలో వెలసిన గ్రామదేవత మంచాలమ్మ దేవతకు విశేష పంచామృతాభిషేకం నిర్వహించారు. మంగళవారం ధనుర్మాసాన్ని పురస్కరించుకొని మఠం పీఠాధిపతి సుబుధేంద్ర తీర్థుల ఆధ్వర్యంలో ఉదయం నుంచి అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. నిర్మలవిసర్జనం, క్షీరాభిషేకం, కుంకుమ సేవ, విశేష పంచామృతాభిషేకం చేసి పట్టుచీర, బంగారు, వెండి ఆభరణాలుతో పాటు వివిధ రకాల పుష్పాలు, ప్రత్యేక అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు.

విద్యుత్ స్తంభాన్ని ఢీకొట్టిన ట్రాక్టర్

ఇరుక్కుపోయిన ఇంజన్

కోసిగి, డిసెంబరు 24 (ఆంధ్రజ్యోతి): కోసిగిలోని రంగప్పగట్టు సమీపంలో మంగళవారం ఓ ట్రాక్టర్ డ్రైవర్ అతివేగంగా రోడ్డు మలుపు తిరుగుతూ అక్కడ ఉన్న విద్యుత్ స్తంభాన్ని ఢీకొట్టాడు. దీంతో ట్రాక్టర్ ఇంజన్ అందులో ఇరుక్కుపోయింది. ఎలాంటి ప్రమా దం జరగకపోవడంతో ఊపిరి పీల్చుకున్నారు. ట్రాక్టర్ డ్రైవర్ అతి వేగమే ఈ ప్రమాదానికి కారణంగా తెలుస్తున్నది. ట్రాక్టర్ ఇంజన్ మూడు విద్యుత్ స్తంభాల్లో ఇరుక్కుపోవడంతో విద్యుత్ అధికారులు అతికష్టమీద ట్రాక్టర్ ఇంజన్‌ను బయటకు తీశారు. ఈ ప్రమాదంతో కోసిగిలో సుమారు గంట పాటు విద్యుత్ అంతరాయం ఏర్పడింది. వెంటనే విద్యుత్ అధికారులు విరిగిపోయిన స్తంభాన్ని మార్చి కొత్త స్తంభాన్ని అమర్చి యథావిధిగా విద్యుత్ సేవలు పునరుద్ధరించారు.



విద్యుత్ స్తంభాన్ని ఢీకొట్టిన ట్రాక్టర్

ముసురు ముంచుతోంది!

ఆందోళనలో మిరప రైతు



గోనెగండ్లలో తడిసిన మిరప పంటను ఆరబెట్టుకున్న దృశ్యం

గోనెగండ్ల, డిసెంబరు 24(ఆంధ్రజ్యోతి): గత నాలుగు రోజులుగా బంగాళగాతంలో ఏర్పడిన తుఫాన్ కారణంగా జిల్లా పశ్చిమ ప్రాంతంలో ముసురుకు కమ్ముకుంది. దీంతో మిరప పంట దెబ్బతింటుందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మండలంలో దాదాపు 6000 ఎకరాల వరకు మిరప పంటను సాగు చేశారు. మిరపకు గిట్టుబాటు ధర లేక పెట్టిన పట్టుబడులు కూడా వచ్చే పరిస్థితి లేదని రైతులు వాపోతున్నారు. క్వింటం ధర కేవలం రూ. 7000 నుంచి రూ. 9000 లోపే పలుకుందన్నారు. ఎకరాకు దాదాపు రూ. లక్ష వరకు పెట్టిబడి పెడితే రూ.50వేలు కూడా వచ్చే అవకాశం లేదని రైతులు లబోదిబోమంటున్నారు.

ప్రభుత్వం ఆదుకోవాలి

రెండు ఎకరాల్లో మిర్చి పంటను సాగు చేసి దాదాపు రూ. 2లక్షలు పెట్టు బడి పెట్టాను. అయితే ముసురు కారణంగా చేతికి వచ్చిన పంట మొత్తం తడిసి పోయి రంగు మారిపోయింది. మార్కెట్‌లో ధర లేదు. ప్రభుత్వం ఆదుకోవాలి.

- బడేసానాయుడు, రైతు, గోనెగండ్ల



రంగు మారిన మిరప